


VARTHAA SAKSHAMU

RNI.Title Code: APTEL/25/A5153

# వార్త సాక్ష్యం

తెలుగు దిన పత్రిక

Editor : SAGINALA RAVI KUMAR

హైదరాబాద్, విజయవాడ | సంపుటి : 01 | సంచిక : 60 | గురువారం 30 జూలై 2026 | పేజీలు : 8 | వెల : 2/-

## ఇరాన్ ఉగ్రవాద స్థావరాల పై అమెరికా, సౌదీ సంయుక్త దాడులు

పశ్చిమాసియాలో దాడులు, ప్రతిదాడులతో ఉద్రిక్తతలు అత్యంత తీవ్రస్థాయికి చేరుకున్నాయి. సౌదీ అరేబియా ఇంధన వనరులు, అమెరికా సైనిక దళాలను లక్ష్యంగా చేసుకుని ఇరాన్ ప్రేరేపిత ఉగ్రవాద ముఠాలు జరిపిన డ్రోన్ దాడులకు ప్రతీకారంగా తాజా దాడులు జరిగాయి. అమెరికా, సౌదీ అరేబియా దళాలు ఇరాక్ లోని పలు ఉగ్రవాద స్థావరాల పై ఈ సంయుక్త వైమానిక దాడులు నిర్వహించాయి.



## పేపర్ లీక్‌ల పై ఉక్కుపాదం.. లోక్‌సభలో పరీక్షల సవరణ బిల్లుకు ఆమోదం

-పబ్లిక్ పరీక్షల సవరణ బిల్లు 2026కు లోక్‌సభ ఆమోదం
- పరీక్షల అక్రమాలకు పాల్పడితే 10 ఏళ్ల జైలు, రూ.10 కోట్ల వరకు జరిమానా
- ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ఏర్పాటు.. మూడు నెలల్లోగా తీర్పునకు నిబంధన
- పరీక్షల వ్యవస్థలో పారదర్శకత పెంచడమే లక్ష్యమని ప్రభుత్వం వెల్లడి



## ‘సర్’ ప్రక్రియను వేగవంతం చేయాలి: భట్టి విక్రమార్క

ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను కాంగ్రెస్ బీఎల్‌ఏలు వేగవంతం చేయాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజలకు చేరువ చేసేందుకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు. ఎమ్మెల్సీ గ్రాడ్యుయేషన్ ఎలక్షన్‌పై జిల్లా ఇన్‌చార్జ్, జిల్లా పీసీసీలతో చర్చించి ముగ్గురు సభ్యులతో ప్యానల్ ఏర్పాటు చేసి నివేదిక అందించాల్సి ఉంటుందని తెలిపారు. ప్రతి ఒక్కరికి ఓటు హక్కు ఉండాలని సూచించారు. బీఎల్‌ఏలు బాగా పనిచేస్తున్నారని అభినందించారు. ఏఐసీసీ కార్యాలయంలో తెలంగాణ కోఆర్డినేషన్ కమిటీ సమావేశం ఈరోజు జరిగిందని మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు.



## రాష్ట్రంలో పారిశ్రామిక అనుకూల విధానాలను వివరించిన ముఖ్యమంత్రి



- ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్ల తయారీ రంగాలపై ప్రధానంగా చర్చలు
- రాష్ట్రంలో పారిశ్రామిక అనుకూల విధానాలను వివరించిన ముఖ్యమంత్రి
- ఏపీ యువతకు నైపుణ్య శిక్షణ, ఉపాధి అవకాశాల పై కీలక ఒప్పందాలు
- తయారీ, సాంకేతిక రంగాల్లో పరస్పర సహకారానికి అంగీకారం

## ఉద్యోగాల భర్తీ నోటిఫికేషన్ పకడ్బందీగా ఉండాలి



- జాబ్ కేలండర్-2026 రెండో దశ ఉద్యోగాల భర్తీకి కొత్త తేదీ ఖరారు
- 3, 4 దశల్లోని 5,369 పోస్టులకు అక్టోబర్ 15న ప్రకటన
- ఉద్యోగాల భర్తీలో ఎలాంటి సమస్యలు రాకుండా చూడాలని అధికారులకు ఆదేశం
- మొత్తం 10,060 పోస్టుల భర్తీ ప్రక్రియను వేగవంతం చేయాలని నిర్ణయం

## రేవంత్, కిషన్ రెడ్డి కారణంగా సింగరేణి అస్తిత్వం ప్రమాదంలో పడింది

- టీఎస్ జెన్‌కోను రంగంలోకి దింపడం వెనుక మర్మం ఏమిటని ప్రశ్న
- ప్రైవేటు సంస్థలకు అప్పగించేందుకు డ్రామా ఆడుతున్నారని విమర్శ

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిల తీరు వల్ల తెలంగాణకే గర్వకారణమైన సింగరేణి సంస్థ తన అస్తిత్వాన్ని, ఉనికిని కోల్పోయే ప్రమాదం లో పడిందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.



## లోక్‌సభలో రాహుల్ ఫైర్: అమిత్ షా, ఆరెస్సెస్ పై తీవ్ర ఆరోపణలు



- లోక్‌సభలో అమిత్ షా, ఆర్‌ఎస్‌ఎస్‌ను టార్గెట్ చేసిన రాహుల్ గాంధీ
- విద్యావ్యవస్థ మొత్తం ఆర్‌ఎస్‌ఎస్ నియంత్రణలో ఉందని ఆరోపణ
- విద్యార్థుల పై పోలీసుల చర్యకు హోంమంత్రి ఆదేశాలిచ్చారని వ్యాఖ్య

VARTHAA SAKSHAMU RNI Title Code: APTEL/25/A9153
వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR



## ఇరాన్ ఉగ్రవాద స్థావరాల పై అమెరికా, సౌదీ సంయుక్త దాడులు

అమెరికా, సౌదీ అరేబియా దళాలు ఇరాక్ లోని పలు ఉగ్రవాద స్థావరాల పై ఈ సంయుక్త వైమానిక దాడులు నిర్వహించాయి. సౌదీ అరేబియాలోని అమెరికన్ సిబ్బందిపై, కీలక ఇంధన మౌలిక సదుపాయాలపై దాడి చేయమని ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ ఆదేశించిన దానికి ప్రతీకారంగా ఈ దాడులు చేశామని యూఎస్, సౌదీ వెల్లడించాయి. 'ఇరాన్ అనుకూల ఉగ్రవాద' గ్రూపులను లక్ష్యంగా చేసుకుని అమెరికా-సౌదీ ఈ ప్రతిదాడులకు పూనుకున్నాయి. అమెరికా సెంట్రల్ కమాండ్, సౌదీ అరేబియా సాయుధ దళాలు తూర్పు ఇరాక్‌లో సంయుక్తంగా కచ్చితమైన దాడులు నిర్వహించాయి. అమెరికా సెంట్రల్ కమాండ్ తమ అధికారిక ప్రకటనలో తెలిపిన వివరాల ప్రకారం.. ఇరాన్ కు చెందిన ఇస్లామిక్ రివాల్యూషనరీ గార్డ్ కార్ప్స్ ఆదేశాలతో నడుస్తున్న ఉగ్రవాద ముఠాలు గత 72 గంటల్లో 30కి పైగా డ్రోన్ దాడులకు పాల్పడ్డాయి. దీనికి సమాధానంగా, తూర్పు ఇరాక్ లోని ఇరాన్ మద్దతు గల ఉగ్రవాద ఆయుధ డిపోలు, లాజిస్టిక్ స్థావరాలపై అమెరికా, సౌదీ యుద్ధ విమానాలు కచ్చితత్వంతో కూడిన దాడులు చేసి వాటిని ధ్వంసం చేశాయి. 2026 ఫిబ్రవరి నుంచి ఏప్రిల్ మధ్య కాలంలోనే ఇరాక్ లోని యూఎస్ పౌరులు, సైనిక స్థావరాలపై ఇరాన్ ప్రోక్సీ ముఠాలు 600 కంటే ఎక్కువసార్లు దాడులకు యత్నించాయని సెంటకామ్ వెల్లడించింది. ఇరాన్, దాని మద్దతు గల దళాలు తక్షణమే ఈ దూకుడును ఆపకపోతే మరింత తీవ్రమైన సైనిక చర్యలు తప్పవని హెచ్చరించింది.

**ఐక్యరాజ్యసమితి చార్టర్ ఆర్టికల్ 51 కింద సౌదీ ప్రతిదాడి**

ఈ సంయుక్త చర్యను సౌదీ అరేబియా రక్షణ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి మేజర్ జనరల్ తుర్కీ అల్-మాలికి ధ్రువీకరించారు. ఇరాక్ భూభాగం నుంచి సౌదీలోని ఈస్టర్న్ ప్రావిన్స్, రియాద్ రీజియన్ లలో ఉన్న చమురు శుద్ధి కర్మాగారాలపైకి దూసుకొచ్చిన పలు డ్రోన్లను తమ వైమానిక రక్షణ వ్యవస్థలు కూల్చివేశాయని తెలిపారు. ఐక్యరాజ్యసమితి (ఖచీ) చార్టర్ లోని ఆర్టికల్ 51 ఇచ్చిన ఆత్మరక్షణ హక్కును ఉపయోగించుకుని, తమ దేశ భద్రత కోసం అమెరికాతో కలిసి ఈ ప్రతిదాడులు జరిపినట్లు స్పష్టం చేశారు. తగిన సమయంలో, తగిన ప్రదేశంలో స్పందించే హక్కు తమకు ఉందన్నారు. కాగా, ఇప్పటివరకు అమెరికా మాత్రమే నేరుగా దాడి చేసేది. కానీ, ఇప్పుడు సౌదీ అరేబియా కూడా ప్రత్యక్షంగా అమెరికాతో కలిసి ఇరాక్ లోని ఇరాన్ ప్రోక్సీ స్థావరాలపై వైమానిక దాడుల్లో పాల్గొనడం పశ్చిమాసియా ప్రాంతీయ రాజకీయాల్లో ఒక కీలక పరిణామం. ఇరాన్ మద్దతుగల గ్రూపుల దాడులు ఇలాగే కొనసాగితే, ఇది పూర్తిస్థాయి ప్రాంతీయ యుద్ధానికి దారితీసే అవకాశం కూడా ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

## పేపర్ లీక్‌ల పై ఉక్కుపాదం.. లోక్‌సభలో పరీక్షల సవరణ బిల్లుకు ఆమోదం

దేశవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీసిన పరీక్షల పేపర్ లీకేజీలు, అక్రమాల పై కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలకు సిద్ధమైంది. ఇందులో భాగంగా 'పబ్లిక్ పరీక్షల సవరణ బిల్లు-2026'కు లోక్‌సభ బుధవారం ఆమోదముద్ర వేసింది. రెండు రోజుల పాటు వాడివేడిగా సాగిన చర్చల అనంతరం వాయిస్ ఓటు ద్వారా ఈ కీలక బిల్లును సభ ఆమోదించింది. పరీక్షల వ్యవస్థలో పారదర్శకతను పెంచడం, విద్యార్థుల భవిష్యత్తును కాపాడటమే లక్ష్యంగా ఈ చట్టాన్ని తీసుకొచ్చినట్లు ప్రభుత్వం తెలిపింది. 2024 నాటి చట్టానికి సవరణలు చేస్తూ రూపొందించిన ఈ కొత్త బిల్లులో అత్యంత కఠినమైన నిబంధనలను చేర్చారు. దీని ప్రకారం పరీక్షల నిర్వహణలో అక్రమాలకు పాల్పడినట్లు రుజువైతే దోషులకు గరిష్ఠంగా 10 సంవత్సరాల వరకు జైలు శిక్ష, రూ.10 కోట్ల వరకు జరిమానా విధించే అవకాశం ఉంది. అంతేగాక దోషుల ఆస్తులను జప్తు చేసే అధికారాన్ని కూడా ఈ చట్టం కల్పిస్తుంది. ఈ తరహా కేసుల విచారణను వేగవంతం చేసేందుకు ప్రత్యేకంగా ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయనున్నారు. ఈ కోర్టులు మూడు నెలల వ్యవధిలోనే విచారణ పూర్తి చేసి తీర్పు వెలువరించాల్సి ఉంటుంది. ఇటీవల నీట్ పేపర్ లీక్ వ్యవహారం దేశవ్యాప్తంగా పెను దుమారం రేపిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే పేపర్ లీక్‌లకు వ్యతిరేకంగా కఠినమైన చట్టం తీసుకువస్తామని ప్రధాని నరేంద్ర మోదీ హామీ ఇచ్చారు. ఆ తర్వాత కేంద్ర క్యాబినెట్ ఆమోదించిన ఈ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టారు. నీట్ అక్రమాలు, ఇతర పరీక్షల్లో అవకతవకాలపైన జులై 20న 'కాక్‌రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) ఆధ్వర్యంలో ఢిల్లీలో 'సంసద్ చలో' పేరిట వందలాది మంది విద్యార్థులు భారీ నిరసన చేపట్టారు. ఈ ఆందోళన హింసాత్మకంగా మారడంతో పోలీసులు, నిరసనకారుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఈ పరిణామాల నేపథ్యంలో నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ జులై 25న తన పదవికి రాజీనామా చేశారు.

## రేవంత్, కిషన్ రెడ్డి కారణంగా సింగరేణి అస్తిత్వం ప్రమాదంలో పడింది

బహిరంగ వేలం ద్వారా కాకుండా నేరుగా సింగరేణి సంస్థకే బొగ్గు బ్లాకులను కేటాయించాలన్న విజ్ఞప్తులను పట్టించుకోకుండా... మణుగూరు పీకేవోసీపీ బొగ్గు బ్లాక్ వేలం నిర్వహించడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని ఆమె ఆరోపించారు. సింగరేణి నేరుగా వేలంలో పాల్గొంటుందని పైకి ప్రకటించిన ప్రభుత్వం, తెరవెనుక మాత్రం టీఎస్ జెన్‌కోను పోటీలోకి తెచ్చేలా కుట్రపూరిత ప్రయత్నాలు చేస్తోందని కవిత మండిపడ్డారు. బొగ్గు తవ్వకాల్లో శతాబ్దాల అనుభవం, ప్రావీణ్యం ఉన్న సింగరేణి సంస్థకు పోటీగా.. ఎలాంటి అనుభవం లేని టీఎస్ జెన్‌కోను రేసులోకి దింపడం వెనుక ఉన్న మర్మమేమిటో రేవంత్ రెడ్డి స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. జెన్‌కో ద్వారా బొగ్గు బ్లాకులను దక్కించుకుని, ఆ తర్వాత అనుభవం లేదనే నెపంతో వాటిని ప్రైవేటు సంస్థలకు అప్పగించేందుకు ఈ ముసుగు డ్రామా ఆడుతున్నారని ఆమె ధ్వజమెత్తారు. సింగరేణి భవిష్యత్తు, అభివృద్ధిపై కిషన్ రెడ్డికి నిజంగానే చిత్తశుద్ధి ఉంటే, వేలం ప్రక్రియతో సంబంధం లేకుండా నేరుగా కేటాయింపులు జరపాలని డిమాండ్ చేశారు.

# 'సర్' ప్రక్రియను వేగవంతం చేయాలి: భట్టి విక్రమార్క

'సర్'పై రివ్యూ చేశామని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. 36 వేల మంది బీఎల్‌ఏలను నియమించినట్లు చెప్పారు. 50 నుంచి 60 శాతం ఈ ప్రక్రియ పూర్తయిందని వెల్లడించారు. రెండు, మూడు రోజుల్లో వందశాతం పూర్తవుతుందని వివరించారు. అర్హతగల ఓటర్ల ఓటు హక్కు కాపాడటం తమ లక్ష్యమని వ్యాఖ్యానించారు. ఈసారి 'సర్' ప్రక్రియ దురుద్దేశంతో జరుగుతుందని చెప్పారు. ఓట్లను కాపాడే ఉద్దేశంతో ఈ సమావేశంలో చర్చించామని తెలిపారు. సంస్థాగత బలోపేతం, పార్టీ ప్రభుత్వ సమన్వయంపై మాట్లాడామని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

**ఢిల్లీలో తెలంగాణ కోఆర్డినేషన్ కమిటీ సమావేశం..**

కాగా, ఢిల్లీ ఇందిరా భవన్‌లో తెలంగాణ కోఆర్డినేషన్ కమిటీ సమావేశం బుధవారం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క , టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి , సీతక్క , సీడబ్ల్యూసీ సభ్యులు మంత్రి దామోదర్ రాజానర్సింహ, వంశీ చంద్ పాల్గొన్నారు. ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. తెలంగాణలో 'సర్' ప్రక్రియ, పార్టీ - ప్రభుత్వం మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయడంపై ప్రధానంగా చర్చించారు. కాంగ్రెస్ అధిష్ఠానం ఏర్పాటు చేసిన కోఆర్డినేషన్ కమిటీ పనితీరు, ఇప్పటివరకు తీసుకున్న నిర్ణయాల అమలుపై సమీక్షించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పార్టీ కార్యక్రమాల సమన్వయం, ప్రజలకు చేరువ చేసే కార్యాచరణపై మాట్లాడారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలు, సంస్థాగత బలోపేతం, రాజకీయ పరిస్థితుల పై కూడా ఈ సమావేశంలో చర్చించినట్లు సమాచారం.

# రాష్ట్రంలో పారిశ్రామిక అనుకూల విధానాలను వివరించిన ముఖ్యమంత్రి

ఆంధ్రప్రదేశ్‌ను ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్ల తయారీ కేంద్రంగా తీర్చిదిద్దే ప్రయత్నాల్లో కీలక ముందడుగు పడింది. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు తైవాన్‌కు చెందిన పలు దిగ్గజ కంపెనీలు ఆసక్తి చూపాయి. ఈ మేరకు తైవాన్ పారిశ్రామిక ఉన్నతస్థాయి ప్రతినిధి బృందం బుధవారం అమరావతిలోని సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ లతో వేర్వేరుగా సమావేశమైంది. ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్లు, ఐటీ, అధునాతన తయారీ రంగాల్లో ఏపీతో భాగస్వామ్యం పెంచుకోవడంపై ఈ భేటీలో ప్రధానంగా చర్చించారు. డెల్టా ఎలక్ట్రానిక్స్, బెన్‌క్యూ, సీబీటీసీ బ్యాంక్, డైమెర్కో, మాస్టర్ హిల్, శాండ్ సన్, జిలీ కన్‌స్ట్రక్షన్స్ వంటి పలు అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులు ఈ బృందంలో ఉన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఆంధ్రప్రదేశ్‌లో పరిశ్రమలకు అందుబాటులో ఉన్న సానుకూల వాతావరణాన్ని వారికి వివరించారు. ప్రపంచ స్థాయి మౌలిక వసతులు, పోర్టులు, విమానాశ్రయాలు, పటిష్టమైన రోడ్డు, రైలు మార్గాల ద్వారా బలమైన లాజిస్టిక్స్ నెట్‌వర్క్‌ను రాష్ట్రం కలిగి ఉందని తెలిపారు. ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్లు, ఎగుమతి ఆధారిత పరిశ్రమలపై తమ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని చెప్పారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే సంస్థలకు విధానపరమైన స్థిరత్వం, వేగవంతమైన అనుమతులు, పూర్తిస్థాయి ప్రోత్సాహకాలు అందిస్తామని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. భారత్‌లో తమ దేశ సంస్థలు ఇప్పటికే తయారీ రంగంలో కీలకంగా ఉన్నాయని, ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో కార్యకలాపాలు విస్తరించేందుకు గల అవకాశాలను పరిశీలిస్తున్నామని తైవాన్ ప్రతినిధులు ముఖ్యమంత్రికి తెలిపారు. తయారీ రంగం, సాంకేతికత, పారిశ్రామికాభివృద్ధిలో పరస్పర సహకారాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని ఇరుపక్షాలు ఏకాభిప్రాయానికి వచ్చాయి.

**మంత్రి లోకేశ్ తో నైపుణ్యాభివృద్ధిపై చర్చలు**

అనంతరం ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేశ్ తో తైవాన్ ప్రతినిధి బృందం ప్రత్యేకంగా సమావేశమైంది. ఈ సమావేశంలో ప్రధానంగా మానవ వనరుల అభివృద్ధి, ఏపీ యువతకు నైపుణ్యాల కల్పనపై చర్చించారు. తైవాన్ తయారీ, సాంకేతిక రంగాల్లోని ఉద్యోగావకాశాలను అందిపుచ్చుకునేలా ఏపీ యువతకు అవసరమైన శిక్షణ, ఉన్నత విద్యా భాగస్వామ్యంపై లోకేశ్ వారితో విస్తృతంగా మాట్లాడారు. ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్ల తయారీ, ప్రిసిషన్ ఇంజనీరింగ్, ఇండస్ట్రియల్ ఆటోమేషన్ వంటి హై-స్కిల్ రంగాలలో పరస్పర సహకారానికి నిర్ణయించారు. ఈ సందర్భంగా ప్రపంచ స్థాయి నైపుణ్య గ్రిడ్‌ను నిర్మించడం, యువతకు మాండరిన్ భాషలో శిక్షణ, పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా సర్టిఫికేషన్, ఇంటర్న్‌షిప్‌లు, విద్యార్థి-ఫ్యాకల్టీ మార్పిడి కార్యక్రమాలు, సంయుక్త పరిశోధనల పై కూడా చర్చలు జరిగాయి. ఏపీ, తైవాన్ మధ్య సంబంధాలలో ఈ సమావేశాలు ఒక కీలక మైలురాయిగా నిలవనున్నాయి. పారిశ్రామిక పెట్టుబడులతో పాటు, నైపుణ్యం కలిగిన మానవ వనరులను అభివృద్ధి చేయడం ద్వారా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు మరింత ఊతం ఇవ్వాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

# ఉద్యోగాల భర్తీ నోటిఫికేషన్ పకడ్బందీగా ఉండాలి

రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో ఎలాంటి న్యాయపరమైన, సాంకేతిక సమస్యలు తలెత్తకుండా పకడ్బందీగా నోటిఫికేషన్లు విడుదల చేయాలని విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ అధికారులను స్పష్టంగా ఆదేశించారు. జాబ్ కేలండర్-2026 అమలుపై ఆయన అధ్యక్షతన ఏర్పాటైన మంత్రుల బృందం బుధవారం ఉండవల్లిలోని ఆయన నివాసంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించింది. ఈ సమావేశానికి పలువురు మంత్రులు ఆన్‌లైన్ ద్వారా హాజరు కాగా, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సహా కీలక అధికారులు పాల్గొన్నారు. రాష్ట్రంలోని వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులు, వాటి భర్తీకి అనుసరించాల్సిన విధివిధానాలపై అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మంత్రుల బృందానికి వివరించారు. జాబ్ కేలండర్-2026లో భాగంగా ప్రకటించిన 10,060 ఉద్యోగాలను మొత్తం నాలుగు దశల్లో భర్తీ చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో భాగంగా తొలి దశలో వివిధ విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న 1,523 అధ్యాపక పోస్టుల భర్తీకి ఈ ఏడాది మే 15నే నోటిఫికేషన్ జారీ చేసిన విషయాన్ని అధికారులు గుర్తు చేశారు. రెండో దశ కింద 3,168 పోస్టులకు వాస్తవానికి ఆగష్టు 15న నోటిఫికేషన్ విడుదల చేయాల్సి ఉంది. అయితే, రాష్ట్రపతి ఉత్తర్వుల అమలులో ఎదురైన కొన్ని సాంకేతిక ఇబ్బందులు, ఉద్యోగ సంఘాల నుంచి వచ్చిన వినతుల నేపథ్యంలో ఈ ప్రక్రియలో స్వల్ప జాప్యం జరిగింది. ఈ కారణాలను పరిగణనలోకి తీసుకున్న మంత్రుల బృందం, రెండో దశ నోటిఫికేషన్‌ను సెప్టెంబర్ 15న విడుదల చేయాలని నిర్ణయించింది. జాబ్ కేలండర్‌ను వేగంగా పూర్తి చేసేందుకు వీలుగా మూడు, నాలుగు దశల ఉద్యోగాల భర్తీకి సంబంధించిన నోటిఫికేషన్‌ను ఒకేసారి అక్టోబర్ 15న విడుదల చేయాలని మంత్రి లోకేశ్ అధికారులను ఆదేశించారు. మూడో దశలో 2,388 పోస్టులు, నాలుగో దశలో 2,981 పోస్టులు భర్తీ చేయనున్నారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఆయా శాఖల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఖాళీలను భర్తీ చేయాలని, ఆ దిశగా అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని సూచించారు. రెండో దశలో భర్తీ చేయనున్న 3,168 పోస్టుల్లో అత్యధికంగా 2,225 పోస్టులు హోంశాఖ పరిధిలోనే ఉన్నాయని అధికారులు తెలిపారు. గ్రూప్-1లో ప్రస్తుతం గుర్తించిన పోస్టుల సంఖ్యను మరింత పెంచాల్సిన అవసరం ఉందని మంత్రుల బృందం ఈ సందర్భంగా అభిప్రాయపడింది. మొత్తం 10,060 పోస్టుల భర్తీ ప్రక్రియలో ఎలాంటి వివాదాలకు తావివ్వకుండా, సకాలంలో పూర్తి చేసి, ప్రతి ఏటా జాబ్ కేలండర్ విడుదల చేసే సంప్రదాయాన్ని కొనసాగించాలని లోకేశ్ దిశానిర్దేశం చేశారు. జాబ్ కేలండర్-2026కు సంబంధించిన పూర్తిస్థాయి ఖాళీల వివరాలను ఈ నెల 6న జరగనున్న కేబినెట్ సమావేశం ముందు ఉంచనున్నట్లు తెలిపారు. ఈ సమీక్షలో మంత్రులు వంగలపూడి అనిత, పి. నారాయణ, కొండపల్లి శ్రీనివాస్, కందుల దుర్గేష్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్, జీఏడీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి షంషేర్ సింగ్ రావత్, పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఛైర్మన్ రాజీవ్ కుమార్ మీనా, ఆర్థికశాఖ కార్యదర్శి వినయ్ చంద్, ఏపీపీఎస్సీ కార్యదర్శి రవి సుభాష్ పాల్గొన్నారు.

# లోక్‌సభలో రాహుల్ ఫైర్: అమిత్ షా, ఆరెస్సెస్ పై తీవ్ర ఆరోపణలు

లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు రాజకీయ ప్రకంపనలు సృష్టించాయి. కేంద్ర హోంమంత్రి అమిత్ షా, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్)ను లక్ష్యంగా చేసుకుని ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ వ్యాఖ్యలపై అధికార పక్షం తీవ్రంగా స్పందించింది. ప్రశ్నపత్రాల లీకేజీ నిరోధక బిల్లుపై బుధవారం జరిగిన చర్చ సందర్భంగా సభలో ఈ వాగ్వాదం చోటుచేసుకుంది. భారత విద్యావ్యవస్థ ఆర్ఎస్ఎస్ గుప్పిట్లోకి వెళ్లిపోయిందని రాహుల్ గాంధీ ఆరోపించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి కేవలం నామమాత్రంగానే ఉన్నారని, తెరవెనుక అసలు వ్యవస్థను నడిపిస్తోంది ఆర్ఎస్ఎస్సేనని ఆయన విమర్శించారు. "ధర్మేంద్ర ప్రధాన్ కేవలం ఒక ప్రతీక మాత్రమే. మన విద్యార్థులకు అసలైన శత్రువు ఆర్ఎస్ఎస్" అని ఆయన వ్యాఖ్యానించారు. విద్యార్థులు జ్ఞానం, సత్యాల దిశగా పయనించకుండా ఆర్ఎస్ఎస్ అడ్డంకులు సృష్టిస్తోందని ఆరోపించారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా లక్ష్యంగా కూడా రాహుల్ విమర్శలు గుప్పించారు. నీట్ అవకతవకలకు వ్యతిరేకంగా కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆధ్వర్యంలో జూలై 20న విద్యార్థులు చేపట్టిన నిరసనపై జరిగిన పోలీసుల చర్యకు అమిత్ షానే బాధ్యుడని ఆయన ఆరోపించారు. "మన విద్యార్థులపై పెల్లెట్లు ప్రయోగించేందుకు హోంమంత్రే అనుమతి ఇచ్చారు. వారి శరీరాల్లోకి పెల్లెట్లు దిగేలా చేశారు" అని రాహుల్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో పార్లమెంటును ఎదుర్కొనే ధైర్యం హోంమంత్రికి లేదని ఆయన ఎద్దేవా చేశారు. రాహుల్ గాంధీ చేసిన ఈ ఆరోపణలపై అధికార పక్ష సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు స్పందిస్తూ, రాహుల్ గాంధీ నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. తక్షణమే ఆయన తన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని, సభకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సైతం రాహుల్ సంయమనం పాటించాలని సూచించారు. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న వ్యక్తులపై ఆరోపణలు చేసేటప్పుడు కచ్చితమైన ఆధారాలు చూపాలని స్పీకర్ ఓం బిర్లా స్పష్టం చేశారు. ఈ క్రమంలో సభలో తీవ్ర గందరగోళం నెలకొనడంతో స్పీకర్ సభను కొద్దిసేపు వాయిదా వేశారు.

# కంగనా రనౌత్ క్షమాపణ చెప్పాలి: సీపీఐ నారాయణ

జెన్ జీ యువత, మహిళలను ఉద్దేశించి ఎంపీ, సినీ నటి కంగనా రనౌత్ అవమానకర, అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు కె. నారాయణ మండిపడ్డారు. తన వ్యాఖ్యలతో సమాజంలో భావోద్వేగాలను దెబ్బతీసిన కంగన... బాధితులైన యువతకు, మహిళలకు బేషరతుగా బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజా జీవితంలో, ప్రజాస్వామ్య వ్యవస్థలో బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న వ్యక్తులు తమ అభిప్రాయాలను వెల్లడించేటప్పుడు సంయమనం, బాధ్యత వహించాలని నారాయణ సూచించారు. సమాజంలో విభేదాలను పెంచి, ప్రజాస్వామ్య విలువలను కాలరాసేలా కంగనా మాట్లాడటం ఏమాత్రం సమర్థనీయం కాదన్నారు. ఇదే క్రమంలో... గతంలో నిరసనకారులను ఉద్దేశించి చేసిన 'బొద్దింకలు' అనే వ్యాఖ్యల పట్ల సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ సానుకూలంగా స్పందించి, ఆ వ్యాఖ్యల వల్ల కలిగిన భావోద్వేగ బాధను గుర్తించి సరిదిద్దుకునే ప్రయత్నం చేయడాన్ని నారాయణ అభినందించారు. తప్పును గుర్తించి దిద్దుకునే ఇటువంటి వైఖరి న్యాయ వ్యవస్థ గొప్పతనాన్ని, ఉన్నతమైన సాంప్రదాయాలను ప్రతిబింబిస్తుందని అన్నారు.

VARTHAA SAKSHAMU RNI Title Code: APTEL/25/A9153
వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR
గురువారం 30 జూలై 2026

## నిజమైన కామెడీ జాతి రత్నాలు వైసీపీ ఎంపీలు

**-నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి.**



నంద్యాల జులై 30 వార్త సాక్ష్యం

నిజమైన కామెడీ జాతి రత్నాలు వైసీపీ ఎంపీలు అని, వాళ్లని చూసే సినిమా తీశారేమో అనిపిస్తుందని, వైసిపి ఐదు సంవత్సరాల కాలంలో ఒక్క టీచర్ ఉద్యోగం కూడా ఇవ్వని వాళ్ళు, టీచర్లను మద్యం షాపుల దగ్గర కాపలా పెట్టిన వైసీపీ వాళ్ళు ఈరోజు నారా లోకేష్ గురించి మాట్లాడుతుంటే హాస్యాస్పదంగా ఉందని, ఎప్పుడు శవాలు దొరుకుతాయా ఎప్పుడు శవయాత్రలు చేద్దామా అని చూసే మీకు మేము చేస్తున్న అభివృద్ధి ఏమి కనిపిస్తుందిలే అంటూ, పేపర్ లీకేజీ బిల్లుపై వైసీపీ ఎంపీలు పారిపోతున్నారని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరిఅన్నారు. బుధవారం భారత పార్లమెంట్లో వైసీపీ ఎంపీలు వైఖరిని నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి తీవ్రంగా తప్పుపట్టారు. పేపర్ల లీకేజీని అరికట్టే అత్యంత కీలకమైన బిల్లుపై సభలో మాట్లాడాలని కోరితే, వైసీపీ ఎంపీలు ఆ విషయాన్ని వదిలేసి తప్పించుకునే ధోరణితో ఇతర అంశాలపై మాట్లాడుతున్నారని విమర్శించారు. అంతేకాకుండా జంతర్మాంతర్ వద్ద వివిధ పార్టీల ఎంపీలు నిరసనలకు మద్దతు తెలిపినప్పటికీ, వైసీపీ ఎంపీలు మాత్రం ఎందుకు మద్దతు ఇవ్వలేదని ఆమె ప్రశ్నించారు. ప్రస్తుతం ఏపీలో ఆందోళనలు చేస్తున్న వైసీపీ నేతలు కేవలం రాజకీయ నిరుద్యోగులుగా మారారని, ప్రజల సమస్యల కంటే వారి స్వార్ధ రాజకీయాలే వారికి ముఖ్యమని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి లోక్ సభలో, పార్లమెంట్ బయట మీడియాతో ఎద్దేవా చేశారు.

## ఎన్టీఆర్ వైద్య సేవ పథకం కింద రోగులకు ఉచిత వైద్య సేవలు అందించాలి

**-ప్రైవేటు ఆసుపత్రులు నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు**

**-జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**



నంద్యాల, జూలై 29 వార్త సాక్ష్యం

డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ పథకం కింద అర్హులైన రోగులకు ఎలాంటి రుసుము వసూలు చేయకుండా అన్ని వైద్య సేవలను పూర్తిస్థాయిలో ఉచితంగా అందించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి వైద్యాధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ ఛాంబర్‌లో డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ పథకానికి సంబంధించి జిల్లా డిస్ట్రిక్ట్ డిసిప్లినరీ కమిటీ (డీడీసీ) సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో డియంహెచ్ఓ డా. వెంకటరమణ, డీసీహెచ్ఎస్ డా. ఓ. లలిత, ఎన్టీఆర్ వైద్య సేవ జిల్లా కోఆర్డినేటర్ రూపేంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను పూర్తిగా ఉచితంగా అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ పథకం ద్వారా భారీ మొత్తంలో నిధులు వెచ్చిస్తోందన్నారు. ఈ నేపథ్యంలో పథకం కింద చికిత్స పొందే ప్రతి రోగికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా నాణ్యమైన వైద్య సేవలు అందేలా అన్ని ఆసుపత్రులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఎన్టీఆర్ వైద్య సేవ పరిధిలో చేరిన ప్రతి కేసును అత్యంత ప్రాధాన్యతతో స్వీకరించి, రోగులకు అవసరమైన అన్ని వైద్య సేవలను నిబంధనల ప్రకారం పూర్తిగా ఉచితంగా అందించాలని ఆదేశించారు. రోగుల నుంచి ఒక్క రూపాయి కూడా వసూలు చేయకుండా చికిత్స అందించడం ప్రతి ఎంప్యానెల్డ్ ఆసుపత్రి బాధ్యత అని కలెక్టర్ స్పష్టం చేశారు. పథకం నిబంధనలు ఉల్లంఘించి పేదల నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడితే సంబంధిత ఆసుపత్రులపై కఠిన చర్యలు తీసుకోవాలని వైద్య అధికారులను ఆదేశించారు. అదేవిధంగా డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ పథకం కింద కన్సల్టేషన్, అవసరమైన వైద్య పరీక్షలు, అత్యవసర వైద్య సేవలు తదితర అన్ని సేవలను రోగులకు పూర్తిగా ఉచితంగా అందేలా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని వైద్యాధికారులకు కలెక్టర్ సూచించారు.

## ఎన్సిటిఈ నిబంధనలు ఉల్లంఘించిన బీఈడీ కళాశాలలపై చర్యలు తీసుకోవాలి: ఎఐఎస్ఎ

**-ఆర్ యూ అధికారుల నిర్లక్ష్యంతో బీఈడీ విద్యా వ్యవస్థ నిర్వీర్యం**

**-ఎఐఎస్ఎ రాష్ట్ర కార్యదర్శి స్వామిదాసు నాగార్జున**

కర్నూలు జులై 30 వార్త సాక్ష్యం

ఎన్సిటిఈ నిబంధనలకు విరుద్ధంగా నిర్వహించబడుతున్న బీఈడీ కళాశాలలపై తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఎఐఎస్ఎ ఆధ్వర్యంలో బుధవారం రాయలసీమ యూనివర్సిటీ ప్రధాన ద్వారం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఐఎస్ఎ రాష్ట్ర కార్యదర్శి స్వామిదాసు నాగార్జున మాట్లాడుతూరాయలసీమ యూనివర్సిటీ పరిధిలోని అనేక బీఈడీ కళాశాలల్లో ఎన్సిటిఈ నిర్దేశించిన ప్రమాణాలు పూర్తిగా ఉల్లంఘిస్తున్న రాయలసీమ యూనివర్సిటీ అధికారులు కళాశాలల చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. అర్హత కలిగిన ప్రిన్సిపాల్‌లు, అధ్యాపకులు లేకపోవడంతో పాటు, గ్రంథాలయం, సైన్స్ ల్యాబ్‌లు, సైకాలజీ ల్యాబ్‌లు, ఐసీటీ ల్యాబ్‌లు, క్రీడా మైదానాలు, తాగునీరు, మరుగుదొడ్లు వంటి కనీస మౌలిక సదుపాయాలు కూడా అనేక కళాశాలల్లో లేవని తెలిపారు. గాయత్రి బీఈడీ కళాశాల (డోన్), శ్రీ సుధా బీఈడీ కళాశాల (డోన్), శారదా బీఈడీ కళాశాల (కర్నూలు), షిర్డీ బాబా బీఈడీ కళాశాల (నందికొట్కూరు), వెంకటరత్న బీఈడీ కళాశాల (కర్నూలు), శివసాయి కృష్ణ బీఈడీ కళాశాల (నందికొట్కూరు), భారతి బీఈడీ కళాశాల (నంద్యాల), బాలాజీ బీఈడీ కళాశాల (పంచలి ంగాల), ప్రతిభ బీఈడీ కళాశాల, శ్రీరంగ బీఈడీ కళాశాల (కొవెలకుంట్ల), సరస్వతి బీఈడీ కళాశాల (కరివేన--ఆత్మకూరు), వరప్రసాద్ బీఈడీ కళాశాల (పంచలింగాల), నాయక్ బీఈడీ కళాశాల (దూపా డు, కర్నూలు) కళాశాలలకు సరైన భవనాలు కూడా



లేవని అప్లికేషన్ సమయాల్లో మాత్రం నామవాత్రంగా బిల్డింగ్ చూపించి యూనివర్సిటీ అధికారులను మైమరిపించి అనుమతులు పొందు తున్నారెమో అని ఆరోపించారు.. కాలేజీలలో బ్లాక్ టీచింగ్ నిర్వహిం చడం లేదని అధిక సంఖ్యలో ఇతర రాష్ట్రాలకు చెందిన విద్యార్థులకు సీట్లను కేటాయిస్తు విద్యను వ్యాపరంగా మార్చారని విమర్శించారు.. తక్షణమే నిబంధనలు పాటించాలని బీఈడీ కళాశాల అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు..ఈ కార్యక్రమంలో ఐసా నాయకులు సూర్య,సాయి తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు పక్కన కంకర బెడ్ లేకపోతే మృత్యువు వెంటాడుతుంది

**-నందికొట్కూరు--పగిడ్యాల రహదారిపై ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాలి**

**-రోడ్డుకు ఇరువైపులా కంకర బెడ్ వేసి రోలర్‌తో బలపరచాలి**

**-సి.పి.ఐ.(ఎం.ఎల్.) లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి పిక్కిలి వెంకటేశ్వర్లు**

నందికొట్కూరు జులై 30 వార్త సాక్ష్యం

నందికొట్కూరు నుండి పగిడ్యాల మండల కేంద్రానికి పునఃనిర్మిస్తున్న ఆర్ అండ్ బి ప్రధాన రహదారిని కేవలం బీటీ రోడ్డుతో పరిమితం చేయకుండా, ఇరువైపులా నాణ్యమైన కంకర (మెటల్) బెడ్ వేసి రోలర్‌తో బలపరిచి ప్రజల ప్రాణాలను కాపాడాలని సి.పి.ఐ.(ఎం.ఎల్.) లిబరేషన్ పార్టీ నంద్యాల జిల్లా కార్యదర్శి పిక్కిలి వెంకటేశ్వర్లు మరియు ప్రజాప్రతినిధులు, ఆర్ అండ్ బి అధికారులను డిమాండ్ చేశారు. బుధవారం పార్టీ నాయకులతో కలిసి పగిడ్యాల--నందికొట్కూరు మధ్య జరుగుతున్న రహదారి నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ, ఈ రహదారి పగిడ్యాల, లక్ష్మాపురం, ప్రాతకోట, గణపురం, బీరవోలు, సంకిరేణిపల్లె లతో పాటు అనేక గ్రామాల ప్రజలకు జీవనాడి లాంటిదని తెలిపారు. ప్రతి రోజు వందలాది బస్సులు, లారీలు, ట్రాక్టర్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు ఈ రహదారిపై ప్రయాణిస్తున్నాయని పేర్కొన్నారు. గతంలో రహదారి పక్కన భుజాలు (షోల్డర్లు) బలంగా లేకపోవడం, గుంతలు ఏర్పడడం, వర్షాకాలంలో బురద పేరుకుపోవడం వల్ల అనేక ఘోర రోడ్డు ప్రమాదాలు జరిగి పలువురు అమాయకులు ప్రాణాలు కోల్పోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు నిర్మాణం పూర్తయినా, పక్కన రక్షణ చర్యలు లేకుంటే మళ్లీ అదే పరిస్థితి పునరావృతమయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్రజల చిరకాల డిమాండ్ మేరకు ఈ రహదారికి నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే, ఎం.పీ. కి ఆయన అభినందనలు తెలిపారు. అయితే సుమారు 3.75 మీటర్ల వెడల్పుతో నిర్మిస్తున్న బీటీ రోడ్డుకు ఇరువైపులా మట్టితో కాకుండా కంకర బెడ్ వేసి రోలర్‌తో బలపరచాలని సూచించారు. దీంతో భారీ వాహనాలు ఎదురెదురుగా వచ్చినప్పుడు వాహనదారులు సురక్షితంగా పక్కకు తప్పుకునే అవకాశం ఉంటుం



దని, ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని అన్నారు. ప్రజల ప్రాణాలకు సంబంధించిన ఈ అంశాన్ని అధికారులు, ప్రజాప్రతి నిధులు అత్యంత ప్రాధాన్యతతో తీసుకుని రహదారి పనుల్లోనే కంకర భుజాల నిర్మాణాన్ని తప్పనిసరిగా చేపట్టాలని, లేదంటే వర్షాకాలంలో మరోసారి ప్రమాదాలు, ప్రాణనష్టాలు సంభవించే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కంటే ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడమే నిజమైన ప్రజాసేవ అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సి.పి.ఐ.(ఎం.ఎల్.) లిబరేషన్ పార్టీ నాయకులు కాటేపోగు సోమన్న, గుంపుల త్యాగరాజు, బి. వెంకటనాయుడు, మహేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మకూరులో జరిగే కబడ్డీ క్యాంప్ ను సద్వినియోగం చేసుకోండి

**-శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి సహకారంతో కబడ్డీ క్రీడలు**

**-ఆత్మకూరు స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ పస్పిల్ మున్నా**

ఆత్మకూరు జులై 30 వార్త సాక్ష్యం

శ్రీశైల నియోజకవర్గస్థాయి కబడ్డీ క్రీడాకారులు ఇటీవలే అమరావతి ఛాంపియన్షిప్ సెలెక్షన్స్ లో పాల్గొని జిల్లాస్థాయి కబడ్డీ విభాగం లో సెలెక్షన్ అయిన వారికి 10 రోజుల వరకు ఆత్మకూరు కెవికె స్టేడియం లో కబడ్డీ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు ఆత్మకూరు స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ పస్పిల్ మున్నా బుధవారం తెలిపారు ఈ సందర్భంగా ఆత్మకూరు స్పోర్ట్స్ క్లబ్ కార్యాలయం లో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ ఆగస్టు 10 వ తేదీ నంద్యాల జిల్లాలో జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు ఉన్నాయని, పోటీల్లో పాల్గొనడానికి ఆత్మకూరు లో 10 రోజుల క్యాంప్ నేటి నుంచి నిర్వహిస్తున్నామని తెలిపారు. క్యాంప్ లో శిక్షణ తీసుకొనే క్రీడాకారు లకు ఉచితంగా వసతి మరియు భోజనం ఏర్పాట్లు చెయ్యడం జరిగిందని తెలిపారు,క్యాంప్ లో శిక్షణ ఉదయం మరియు సాయంత్రం ఫ్లడ్ లైట్ లలో నిర్వహిస్తామని తెలిపారు,ఇటీవలే పట్టణంలో శ్రీశైల నియోజకవర్గస్థాయి కబడ్డీ సెలెక్షన్స్ లో పాల్గొని జిల్లాస్థాయి కి సెలెక్ట్ అయిన వాళ్ళు ఈ యొక్క క్యాంప్ ను సద్వినియోగం చేసుకోవాలని వివరించారు, నియోజకవర్గ క్రీడాకారులను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పాల్గొనేలా స్థానిక ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి క్రీడాకారులకు అన్ని విధాలుగా సహకరిస్తున్నారని, అన్నారు క్రీడాకారుడు ప్రతిఒక్కరు చదువుతో పాటు క్రీడల్లో పాల్గొని ఉన్నత స్థానానికి చేరుకోవాలని తెలిపారు. క్యాంప్ కి సంబంధించిన సమాచారం కోసం 9441060684 నెంబర్ ని





సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో తైక్వాం డో అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు, నాయబ్. సయ్యద్. అసదుల్లా, జూనియర్ కళాశాల లెక్చరర్, అబ్దుల్, జబ్బార్, స్టేడియం, మహబూబ్, స్టేడియం కబడ్డీ శిక్షకులు సతీష్, శిక్షణ తీసుకొనే క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు

## ప్రధానమంత్రి ఫజల్ బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

**-ఆత్మకూరు జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ మేనేజర్ మహమ్మద్ రసూల్**

ఆత్మకూరు జులై 29 వార్త సాక్ష్యం

ఖరీఫ్ సీజన్లో ఎల్ నినో ప్రభావం మరియు వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా పంటలు సాగు చేసుకున్న రైతులకు ఎటువంటి నష్టం జరగకుండా ప్రధానమంత్రి ఫసల్ భీమా యోజన పథకం ను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కేడీసీసీ బ్యాంకు మేనేజర్ మహమ్మద్ రసూల్ బుధవారం కోరారు. ఈ సందర్భంగా మేనేజర్ మహమ్మద్ రసూల్ మాట్లాడుతూ ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన,అనేది ప్రకృతి వైపరీత్యాలు, తెగుళ్ల మరియు వ్యాధుల వల్ల జరిగే పంట నష్టానికి ఆర్థిక భద్రతను కల్పిస్తుందన్నారు. ఈ పథకం ద్వారా రైతులు చాలా తక్కువ ప్రీమియంతో ఆహార, నూనెగింజలు మరియు వాణిజ్య, హార్టికల్చర్ పంటలకు బీమా పొందవచ్చునని సూచించారు. వాతావరణ మార్పులు, వర్షాభావం లేదా అధిక వర్షాల వల్ల పంట నష్టపోయిన రైతన్నలకు ఈ పథకం ద్వారా నష్టపరిహారం అందుతుందన్నారు. రైతులు భూమికి సంబంధించిన పత్రాలు, ఆధార్ కార్డ్, బ్యాంకు పాస్బుక్ మరియు పంట సాగు ధృవీకరణ పత్రాలను ఆత్మకూరు, కొత్తపల్లి, పాములపాడు, వేంపెంట సహకార సంఘములలో సమర్పిస్తే పంట నమోదు చేస్తారని స్పష్టం చేశారు. రైతులకు ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని,




పంట నష్టం నుండి కాపాడుకోవాలని ఆయన సూచించారు.

# నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య ఆధ్వర్యంలో

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ





-వేంపెంట మాజీ సర్పంచ్ టేకూరి.రామసుబ్బమ్మ తో కలిసి బాధితులకు చెక్కులు అందజేత

పాములపాడు జూలై 29 వార్త సాక్ష్యం

అనారోగ్య సమస్యలతో ఆర్థిక సహాయం కోసం ఎదురు చూస్తున్న పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా సహాయం అందించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉన్నారని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త.జయసూర్య చొరవ తీసుకొని, తన కార్యాలయానికి వచ్చిన సీఎంఆర్ఎఫ్ అర్జీలను స్వయంగా పరిశీలించి ప్రత్యేక సాయం అందేలా చూశారు. బుధవారం నియోజకవర్గం లోని పాములపాడు మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను నందికొట్కూరు శాసనసభ్యులు గిత్త.జయసూర్య వేంపెంట గ్రామ మాజీ సర్పంచ్ డ టిడిపి గ్రామ అధ్యక్షురాలు టేకూరి.రామసుబ్బమ్మ, అధికారులతో కలిసి పంపిణీ చేశారు, మండలంలోని, వేంపెంట గ్రామానికి చెందిన సుప్రజ కి రూ. 17,150/-, జూటూరు గ్రామానికి చెందిన సుబ్బన్న కి రూ. 35,534/-, కృష్ణనగర్ గ్రామానికి చెందిన దుర్గా రెడ్డి కి 1,13,073/- బాధితులకు అందజేశారు. మొత్తం 3 మంది బాధితులకు రూ.165,757 లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేయడం జరిగింది,ఈ సందర్భంగా బాధిత లబ్ధిదారులు తమ క్లిష్ట సమయంలో ప్రభుత్వం అందించిన ఆర్థిక సహాయానికి, తమ సమస్యలను గుర్తించి స్పందించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ జి.సుభద్రమ్మ, ఎంపీడీవో ఎన్.చంద్రశేఖర్, ఎస్ఐ పి.తిరుపాలు, వేంపేంట గ్రామ టీడీపీ నాయకులు నీటి సంఘం వైస్ ప్రెసిడెంట్ (డీసీ)ఆల్ఫ్రెడ్, ముద్దపాటి ప్రసాద్, వేమా రెడ్డి, బోనాల భాస్కర్, చిన్న పక్కిరయ్య, సుబ్బారావు, చిన్న హుస్సనయ్య, టిడిపి మండల నాయకులు డివిఎంసి మెంబర్ లింగాల నాగరాజు, ఎర్రగూడూరు హరినాధ రెడ్డి, కృష్ణానగర్ ముడియాల.సుబ్బారెడ్డి, పాండురంగారెడ్డి, ఎమ్మెల్యే గవర్నమెంట్ పిఏ రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మకూరులోభక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి వేడుకలు











-వేల సంఖ్యలో తరలివచ్చిన సాయిబాబా భక్తాదులు
-అంగరంగ వైభవంగా సాయిబాబా రథోత్సవం.
-పలువురు ప్రముఖులతో గురు పౌర్ణమి పండగ వాతావరణం
-ఆత్మకూరు డిఎస్పి ఆర్. రామాంజి నాయక్ పర్యవేక్షణలో గురు పౌర్ణమి వేడుకలు

ఆత్మకూరు జులై 29 వార్త సాక్ష్యం

సాయిబాబా దేవాలయంలో స్వస్తి శ్రీ పరభవ నామ సంవత్సర ఆషాడ శుద్ధ పౌర్ణమి భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి వేడుకలను పెద్ద ఎత్తున నిర్వహించారు. బుధవారం గురు పౌర్ణమిని వేడుకల సందర్భంగా పట్టణంలో వెలిసిన సాయిబాబా ఆలయాన్ని ప్రత్యేకంగా పూలు. విద్యుత్ దీపాలతో అలంకరించారు. పలువురు ప్రముఖులు సాయిబాబా ఆలయ కమిటీ బృందం ఆధ్వర్యంలో సాయిబాబా భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు ఆత్మకూరు డిఎస్పి ఆర్. రామాంజి నాయక్ ఆత్మకూరు అర్బన్ సీఐ ఓ. మహేశ్వర్ రెడ్డి పర్యవేక్షణలో సాయిబాబా రథం ఊరేగింపును పెద్ద ఎత్తున నిర్వహించారు ఈ గురు పౌర్ణమి వేడుకల సందర్భంగా శ్రీ సాయినాధుడు ప్రత్యేకంగా అలంకారణ లో భక్తులు దర్శనమిచ్చాడు. గురు పౌర్ణమి ని పురస్కరించుకొని అధిక సంఖ్యలో భక్తులు ఆలయాన్ని చేరుకొని బాబాను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కలియుగ దైవం. అభయ ప్రదాత శ్రీ శ్రీ శ్రీ శిరిడి సాయి నాథ గురువరెన్యులకు ప్రత్యేక పూజలు శ్రీ సాయి సత్య వ్రతము. వైభవంగా అలంకారం అలంకార పూజలు నిర్వహించారు. ఉదయం 6 గంటలకు కాకడ హారతి. ఉదయం 7.30 గంటల నుండి బాబాకు నవవిధ అభిషేకాలు, పుష్పార్చన, మంగళహారతి,10.30 గంటల నుంచి బాబాకు ప్రత్యేక అలంకారం. అలంకార దర్శనం, తీర్థ ప్రసాదాల వితరణంగావించారు. సాయిబాబా కు ప్రత్యేక పూజలు చేసేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలి రావడంతో ఆలయం ప్రాంగణం సాయి నామస్మరణతో మారుమోగింది, ఆలయం భక్తులతో కిటకిటలాడింది, కోలాటాలతో కన్నుల పండుగగా రథోత్సవం సాగింది. సాయిబాబా ఆలయం వద్ద నుంచి రథోత్సవం ప్రారంభమై కేజీ రోడ్డు వెంట సాగి ఆర్టీసీ బస్టాండ్ గౌడ్ సెంటర్ మీదుగా తిరిగి ఆలయం చేరుకుంది. ఈ రథోత్సవాన్ని చూసేందుకు కులమతాలకు అతీతంగా రోడ్డుపైకి ప్రజలు రావడంతో కిక్కరిసిపోయింది. మధ్యాహ్నం భక్తులకు భోజన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయగా నారాయణ పాఠశాలకు చెందిన



విద్యార్థులు భక్తులకు భోజనాలను పంపిణీ చేశారు. రాత్రి 9 గంటలకు సాయిబాబాకు సేజ్ హారతి నిర్వహించినట్లు శిరిడి సాయిబాబా సేవా సమితి. భక్త బృందం తెలిపారు. గురు పౌర్ణమి సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. సాయిబాబా ఊరేగింపులో రథోత్సవం పండగ సందర్భంగా సాయిబాబా భక్తాదులు వేల సంఖ్యలో తరలివచ్చి గురు పౌర్ణమి వేడుకల్లో పాల్గొన్నారు భారీ పోలీసు బందోబస్తు మధ్యలో గురు పౌర్ణమి వేడుకలకు ప్రత్యేక ఏర్పాట్లు చేసిన పోలీస్ సిబ్బందికి ఆలయ కమిటీ బృందం ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు

## నంద్యాల జిల్లా పోలీసులకు ప్రత్యేక మెడిటేషన్ శిక్షణ కార్యక్రమం

-ఒత్తిడిని అధిగమించి సమర్థవంతమైన విధి నిర్వహణకు ధ్యానం ఎంతో అవసరం
-జిల్లా ఎస్పీ సునీల్ షరాన్ ఐపీఎస్







నంద్యాల జులై 29 వార్త సాక్ష్యం

నంద్యాల పట్టణంలోని రామకృష్ణ పీజీ కళాశాలలో జిల్లా పోలీసు సిబ్బందికి జిల్లా ఎస్పీ శ్రీ సునీల్ షోరాణ్, ఐపీఎస్ సహకారంతో, రిటైర్డ్ డీజీపీ ఆదిత్య ఆర్య, ఐపీఎస్ ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక మెడిటేషన్ శిక్షణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ డీజీపీ ఆదిత్య ఆర్య, ఐపీఎస్ మాట్లాడుతూ, పోలీసు విధులు అత్యంత బాధ్యతాయుతమైనవని, ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణతో పాటు శాంతిభద్రతల పరిరక్షణ, బందోబస్తు విధులు, ఎస్కార్ట్ డ్యూటీలు, గార్డ్ డ్యూటీలు, వీఐపీ భద్రత, నేరాల నియంత్రణ, ప్రమాదాలు మరియు అత్యవసర పరిస్థితుల్లో పోలీసులు నిరంతరం అప్రమత్తంగా పనిచేస్తారని తెలిపారు. ఇలాంటి నిరంతర విధుల కారణంగా ఎ ఉంటాయని పేర్కొన్నారు. పోలీసు సిబ్బంది ఒత్తిడిని సమర్థవంతంగా అధిగమించి ప్రశాంతమైన మనస్సుతో విధులు నిర్వహించేందుకు ధ్యానం ఒక ఉత్తమ సాధనమని ఆయన వివరించారు. ప్రతిరోజూ కొద్దిసేపు ధ్యానం చేయడం ద్వారా మానసిక ప్రశాంతత, ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం పెరగడంతో పాటు నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం మెరుగుపడుతుందని, కోప నియంత్రణ, భావోద్వేగ సమతుల్యత పెంపొందుతాయని తెలిపారు. జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్, ఐపీఎస్ మాట్లాడుతూ, ఈ శిక్షణ కార్యక్రమంలో పోలీసు అధికా రులు, సిబ్బందికి ధ్యాన విధానాలను ప్రత్యక్షంగా నేర్చుకోవడం జరిగిందని, వాటిని దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని సూచించారు.పోలీసు సిబ్బంది శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యాన్ని కూడా సమా నంగా కాపాడుకోవాల్సిన అవసరాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది ధ్యాన శిక్షణను ఆసక్తిగా అభ్యసించి, ఇటువంటి కార్యక్రమాలు పోలీసు సిబ్బంది మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో, విధి నిర్వహణ సామర్థ్యాన్ని పెంపొందించడంలో ఎంతో దోహదపడతాయని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ఎస్. ఖాదర్ భాష , ఏఆర్ అడిషనల్ ఎస్పీ చిన్ని కృష్ణ , ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, రామకృష్ణ విద్యాసంస్థల అధినేత రామకృష్ణారెడ్డి ,జిల్లా పోలీసు అధికారులు, వివిధ విభాగాల పోలీసు సిబ్బంది, శిక్షకులు మరియు పాల్గొన్నారు.

## ఆత్మకూరు అటవీ డివిజన్లో అనుమానాస్పదంగా పెద్దపులి మృతి

-ప్రపంచ పెద్దపులుల దినోత్సవం రోజు పులి మృతి
-అప్రమత్తమైన అటవీ శాఖ అధికారు లు
-విషయం బయటకి పొక్కకుండా రహస్యంగా విచారణ
-పెద్దపులి మృతికి గల పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది



ఆత్మకూరు జులై 29 వార్త సాక్ష్యం

దేశవ్యాప్తంగా ప్రపంచ పెద్ద పులుల దినోత్సవాన్ని పెద్ద ఎత్తున నిర్వహించుకుంటున్న నేపథ్యంలో నల్లమల్ల అటవీ ప్రాంతంలో ఓ పెద్దపులి మృతి చెందిన సంఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది ఈ పెద్దపులి మృతికి గల కారణాలు పూర్తిస్థాయిలో తెలియాల్సి ఉంది అప్రమత్తమైన అటవీ శాఖ అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని రహస్యంగా విచారణ చేపట్టినట్లు సమాచారం ఆ పెద్దపులి ఏ డివిజన్లో మృతి చెందింది అనే విషయాలు పూర్తిస్థాయిలో తెలియాల్సి ఉంది ఒకవైపు అటవీ శాఖ అధికారులు ప్రపంచ పెద్ద పులుల దినోత్సవం వేడుకలు నిర్వహిస్తున్న నేపథ్యంలో ఊహించని విధంగా అటవీ శాఖ అధికారులకు పెద్దపులి మృతి చెందడంపై అప్రమత్తమయ్యారు ఈ పెద్దపులి మృతి చెందిన విషయాలు మీడియాకు తెలియజేస్తారా..!? లేక రహస్యంగా దాచిపెడతారా అనే విషయాన్ని వేచి చూద్దాం

వార్త సాక్ష్యం
గురువారం 30 జూలై 2026

## జీవో 396 రద్దు చేయాలంటూ దస్తావేజు లేఖరుల నిరసన

-10వ రోజూ కొనసాగిన దస్తావేజు లేఖరుల నిరవధిక పెన్‌డౌన్



బాపట్ల జులై 29 వార్త సాక్ష్యం

రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెం.396, రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల (ఆర్ఎస్‌కే) ఏర్పాటు, పబ్లిక్--ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) విధానాల వల్ల దస్తావేజు లేఖరుల ఉపాధికి తీవ్ర ముప్పు వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేస్తూ బాపట్ల ఆర్వో కార్యాలయం వద్ద బాపట్ల దస్తావేజు లేఖరుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక పెన్‌డౌన్ కార్యక్రమం బుధవారం పదో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సంఘ సభ్యుడు ఉప్పాల పూర్ణచంద్రరావు మాట్లాడుతూ, ప్రభుత్వం వెంటనే జీవో 396ను రద్దు చేయాలని, రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల ఏర్పాటును నిలిపివేయాలని, పబ్లిక్--ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ విధానాన్నిఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విధానాలు అమల్లోకి వస్తే దస్తావేజు లేఖరుల సంప్రదాయ వృత్తి దెబ్బతిని వేలాది కుటుంబాలు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం దస్తావేజు లేఖరుల సమస్యలను గుర్తించి వారి జీవనోపాధిని కాపాడేలా తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో బాపట్ల ఆర్వో డాక్యుమెంట్ రైటర్స్ సంఘం అధ్యక్షుడు కారుమూరి నారాయణరావు (బుజ్జి), ఉపాధ్యక్షుడు పి. నరసింహారావు, ప్రధాన కార్యదర్శి తిమ్మిడి కొండలరావు, సంయుక్త కార్యదర్శి తుళ్లూరు సంతోష్ గోకుల్ గుప్తా, ఖజాంచి విగ్రహాలు శ్రీనివాసరావు, సభ్యులు ఉప్పాల పూర్ణచంద్రరావు, ఎం. రాంబాబు, నూనె శ్రీనివాసరావు, పాశం సుబ్బారావు, ఉసిరికాయల మాణిక్యరావు, బుర్ల పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## యువనేతకు యువకుల బ్రహ్మరథం

-బాణాసంచా మోతలు, కనకతప్పెట్లతో మహేంద్రుడు కి గ్రామస్థుల ఘన స్వాగతం



చీరాల జులై 29 వార్త సాక్ష్యం

చీరాల నియోజకవర్గంలోని పాపాయపాలెంలో పోలేరమ్మ తల్లి తిరునాళ్ల వేడుకలు అంబరాన్ని అంటాయి. గ్రామమంతా భక్తిశ్రద్ధలతో కళకళలాడగా, టీడీపీ అధికార ప్రతినిధి మద్దులూరి మహేంద్రనాథ్ రాకతో వేడుకలకు మరింత శోభ చేకూరింది. స్థానిక కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు ఆయనకు బాణాసంచా మోతలు, కనకతప్పెట్ల నృత్యాలు, బైక్ ర్యాలీలు, భారీ జనసందోహం మధ్య ఘన స్వాగతం పలికారు. మహేంద్రనాథ్ రాకతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొని సందడి నెలకొంది. ఈ సందర్భంగా పోలేరమ్మ తల్లి ఆలయంలో మహేంద్రనాథ్ ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు చీరాల నియోజకవర్గ ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని ప్రార్థించారు. అనంతరం గ్రామ పెద్దలు, మహిళలు, యువత ఆయనను ఘనంగా సత్కరించి తిరునాళ్ల వేడుకల్లో పాల్గొనడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. వేడుకల్లో భక్తి, సంప్రదాయం, రాజకీయ ఉత్సాహం కలగలిసిన వాతావరణం నెలకొనగా, మహేంద్రనాథ్‌కు లభించిన ఆదరణ స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## అంగవైకల్య బాధితులకు అండ

బాపట్ల జులై 29 వార్త సాక్ష్యం



బాపట్ల పట్టణం లో అంగవైకల్యంతో బాధపడుతున్న కుష్టు రోగులకు పాదాల రక్షణతో పాటు నడకలో సౌలభ్యం కల్పించేందుకు మైక్రో సెల్యులర్ రబ్బర్ (ఎంసీఆర్)తో తయారు చేసిన ప్రత్యేక చెప్పులను జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎస్. విజయమ్మ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కుష్టు వ్యాధి కారణంగా పాదాలకు అంగవైకల్యం ఏర్పడిన వారికి ఎంసీఆర్ చెప్పులు ఎంతో ఉపయోగ కరంగా ఉంటాయని తెలిపారు. పాదాలపై ఒత్తిడి తగ్గించి గాయాలు కాకుండా రక్షించడంతో పాటు, నడకను సులభతరం చేయడంలో ఇవి కీలకంగా దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కుష్టు, ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ వి. సోమ్లు నాయక్, జిల్లా న్యూక్లియస్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సాదిక్, బాపట్ల జిల్లాలోని డిప్యూటీ పారా మెడికల్ అధికారులు (డీపీఎంఓలు) పాల్గొన్నారు.

# విద్యార్థుల పోరాటమే విజయం

బాపట్ల జులై 29 వార్త సాక్ష్యం




కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విద్యార్థి ఉద్యమాల విజయమేనని సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ పేర్కొన్నారు. బాపట్లలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా విద్యా విధానం, పరీక్షల నిర్వహణలో జరిగిన లోపాలపై విద్యార్థులు చేపట్టిన ఆందోళనల ఫలితంగానే కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని ఆయన అన్నారు. కేంద్ర ప్రభుత్వం విద్యను కాషాయీకరణ చేసే దిశగా వ్యవహరిస్తోందని, పరీక్షల పేపర్ లీకేజీలు విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీస్తున్నాయని ఆరోపించారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత 88 సార్లు పరీక్షల పేపర్ లీకేజీలు జరిగాయని, నీట్ పేపర్ లీకేజీ వాటిలో పరాకాష్ట అని విమర్శించారు. నీట్ వ్యవహారం అనంతరం దేశవ్యాప్తంగా విద్యార్థులు, యువజనులు పెద్దఎత్తున ఉద్యమాలు చేపట్టా రని, ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరిగిన నిరసనలకు వివిధ రాజకీయ పార్టీలు, సామాజిక కార్యకర్తలు మద్దతు తెలిపారని పేర్కొన్నారు. ఆందోళనల సందర్భంగా విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జి చేశారని ఆరోపించారు. ధర్మేంద్ర ప్రధాన్ స్థానంలో నియమితులైన ప్రహ్లాద్ జోషి కూడా ఆర్ఎస్ఎస్ నేపథ్యానికి చెందిన వారేనని పేర్కొంటూ, ఆయన కూడా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఎన్టీఏ విధానాన్ని రద్దు చేసి, జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ)ను ఉపసంహరిం చుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. విద్యార్థి ఉద్యమాలకు సీపీఐ తరఫున పూర్తి మద్దతు కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీ యూసీ నాయకులు మామిడిబత్తుల అశోక్, ముత్తిరెడ్డి నాగేశ్వరరావు, పార్టీ నాయకులు చీరాల సూర్యనారా యణరెడ్డి, ఫన్నీ, ఎలమంద నరసింహ, కంచర్ల జాన్సన్, నాగరాజు, గోపిరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటింటా అభివృద్ధి బిసంక్షేమం పై కూటమి ప్రచారం

కొల్లూరుజులై 29 వార్త సాక్ష్యం



స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో కూటమి ప్రభుత్వం చేపట్టిన “రెండేళ్ల నమ్మకం -- అభివృద్ధి, సంక్షేమం” ఇంటింటి ప్రచార కార్యక్రమం కొల్లూరు మండలం చిన్నపులివర్రు గ్రామంలో మూడో రోజు కొనసాగింది. వేమూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబు ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిసి గత రెండేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా తల్లికి వందనం, దీపం--2, అన్నదాత సుఖీభవ, మహిళా శక్తి, ఎన్టీఆర్ భరోసా, పీఎం కిసాన్, గృహ నిర్మాణం, డ్వాక్రా రుణాలు, ఎన్టీఆర్ వైద్య సేవ, సీఎంఆర్ఎఫ్ తదితర పథకాల ద్వారా గ్రామ ప్రజలకు అందిన ప్రయోజనాలను వివరించారు. చిన్నపులివర్రు గ్రామానికి వివిధ సంక్షేమ పథకాల కింద రూ.2.84 కోట్ల మేర లబ్ధి చేకూరిందని తెలిపారు. గ్రామంలో సీసీ రోడ్లు, పంచాయతీ భవనం, బరియల్ గ్రౌండ్ కల్వర్టు నిర్మాణంతో పాటు గృహాల నిర్మాణం కొనసాగుతున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే గ్రామంలో రోడ్లు, డ్రైనేజీలు, హ్యాండ్ పంపులు, వీధి దీపాలు, విద్యాసంస్థలు వంటి మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయని చెప్పారు. ప్రచారంలో భాగంగా గ్రామస్తుల సమస్యలను తెలుసుకుని వాటిని మైటీడీపీ యాప్ ద్వారా నమోదు చేశారు. గ్రామంలో రెండు రోడ్ల సమస్యలను ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గ్రామంలో ఉన్న ఇతర సమస్యలను కూడా అధికారులు వెంటనే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నక్కా ఆనంద్‌బాబు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమం, గ్రామీణాభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రాష్ట్రంలో ‘స్వర్ణాంధ్ర--విజన్ 2047’ లక్ష్యంతో మౌలిక వసతుల అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణ, ఉపాధి అవకాశాల కల్పన, సాగునీటి ప్రాజెక్టులు, అమరావతి అభివృద్ధి వంటి కార్యక్రమాలను వేగవంతంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఇదే అభివృద్ధి ప్రస్థానం కొనసాగించేందుకు ప్రజల సహకారం అవసరమని కోరారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, సీయూబీ ఇన్‌ఛార్జ్‌లు, పార్టీ కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆంధ్ర పారిస్‌కు ‘గుంతల గాయం’





-ప్రభుత్వాసుపత్రి రహదారి కాదు... ప్రాణాలతో చేసే పరీక్ష!

-మంత్రి నియోజకవర్గంలోనే పేషెంట్లకు నరకయాతన... అధికారులు నిద్రలోనా?

తెనాలి జులై 29 వార్త సాక్ష్యం

ఆంధ్రప్రదేశ్‌లో “ఆంధ్ర పారిస్”గా పేరొందిన తెనాలి నేడు గుంతల నగరంగా మారిందా? రాష్ట్ర మంత్రివర్గంలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ నియోజకవర్గంలోనే ప్రభుత్వాసుపత్రికి వెళ్లే ప్రధాన రహదారి ప్రాణాంతకంగా మారింది. అడుగడుగునా గుంతలు, పక్కనే తెరిచి ఉన్న డ్రైనేజీ, మురుగునీరు, దోమల బెడదతో రోగులు నరకయాతన అనుభవిస్తున్న దృశ్యాలు ‘రక్షణ’ దినపత్రిక ప్రత్యేక పరిశీలనలో వెలుగుచూశాయి. ఒక నగర అభివృద్ధిని అంచనా వేయాలంటే ముందుగా అక్కడి ప్రభుత్వాసుపత్రికి వెళ్లే రహదారిని చూడాలని పెద్దలు చెబుతుంటారు. అయితే, ఆంధ్ర పారిస్‌గా పేరొందిన తెనాలిలో ప్రభుత్వాసుపత్రికి వెళ్లే ప్రధాన రహదారిని చూస్తే అభివృద్ధి మాట పక్కన పెడితే కనీస మానవత్వమే ప్రశ్నార్థకంగా మారిన పరిస్థితి కనిపిస్తోంది. రాష్ట్రంలోనే కీలక మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో ఇలాంటి దుస్థితి నెలకొనడం ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వాసుపత్రికి వెళ్లే రహదారి ప్రారంభం నుంచి చివరి వరకు అడుగడుగునా భారీ గుంతలు, పగిలిపోయిన రోడ్డు, పేరుకుపోయిన మురుగునీరు, ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు స్పష్టమైంది. ప్రతి రోజు వందలాది మంది పేద ప్రజలు ఈ ప్రభుత్వాసుపత్రికే వైద్యం కోసం వస్తుంటారు. ద్విచక్ర వాహనాలు, ఆటోలు, అంబులెన్సులు, నడిచివచ్చే వృద్ధులు, గర్భిణులు, అత్యవసర రోగులు... అందరూ ఇదే మార్గాన్ని ఉపయోగించాల్సి వస్తోంది. అయితే ఆసుపత్రికి చేరుకునేలోపే గుంతల కారణంగా రోగుల పరిస్థితి మరింత విషమమవుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు పక్కనే ఉన్న భారీ డ్రైనేజీకి ఎలాంటి రక్షణ గోడ లేకపోవడం మరింత ప్రమాదకరంగా మారింది. ముఖ్యంగా రాత్రి వేళల్లో లేదా వర్షం సమయంలో ప్రమాదం జరిగితే ప్రాణనష్టం తప్పదనే భయం స్థానికుల్లో వ్యక్తమవుతోంది. వర్షపు నీరు గుంతల్లో నిలిచిపోవడంతో రోడ్డు ఎక్కడ, గుంత ఎక్కడ అన్నది కూడా గుర్తించలేని పరిస్థితి నెలకొంది. స్థానికుల కథనం ప్రకారం, గత రెండు రోజుల వ్యవధిలోనే ఇద్దరు రోగులు ఈ రహదారిలో ప్రమాదానికి గురై తీవ్ర గాయాలపాలైనట్లు తెలిసింది. అయినప్పటికీ సంబంధిత అధికారులు స్పందించకపోవడం ప్రజల్లో ఆగ్రహానికి కారణమవుతోంది. రోడ్డంతా నిల్వ ఉన్న మురుగునీటితో దోమలు విపరీతంగా పెరిగాయని, ఇదే పరిస్థితి కొనసాగితే డెంగీ, డయేరియా వంటి అంటువ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని ఆసుపత్రి సిబ్బంది సైతం ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. ఒకవైపు ప్రజలకు వైద్యం అందించాల్సిన ఆసుపత్రి... మరోవైపు ఆసుపత్రి ముందే వ్యాధులకు కేంద్రంగా మారుతున్న పరిసరాలు అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తున్నాయి. ఇక్కడే మరో కీలక ప్రశ్న తలెత్తుతోంది. రాష్ట్ర మంత్రివర్గంలో కీలక స్థానంలో ఉన్న మంత్రి నాదెండ్ల మనోహర్ తన సొంత నియోజకవర్గంలోని ప్రభుత్వాసుపత్రిని ఇటీవల సందర్శించారా? సందర్శించి ఉంటే ఈ రహదారి దుస్థితి ఆయన దృష్టికి రాలేదా? లేక అధికారులు అసలు వాస్తవాలను మంత్రికి తెలియనివ్వడం లేదా? అనే సందేహాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. మరోవైపు మున్సిపల్ అధికారులు కూడా ఈ సమస్యను పూర్తిగా విస్మరించినట్లు కనిపిస్తోంది. అత్యవసరంగా మరమ్మతులు చేయాల్సిన రహదారిని నెలల తరబడి అలాగే వదిలేయడం వెనుక కారణాలేమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అభివృద్ధి, స్మార్ట్ సిటీలు, మౌలిక వసతులపై ప్రభుత్వాలు గొప్పలు చెప్పుకుంటున్న వేళ... ప్రభుత్వాసుపత్రికి వెళ్లే ప్రధాన రహదారే ఈ స్థాయిలో నిర్లక్ష్యానికి గురికావడం అధికార యంత్రాంగ వైఫల్యానికి నిదర్శనమని స్థానికులు మండిపడుతున్నారు. ప్రభుత్వాసుపత్రికి వచ్చే ప్రతి పేదవాడి ప్రాణం ప్రభుత్వ బాధ్యతే. కానీ ప్రస్తుతం ఆ బాధ్యత గుంతల్లో కూరుకుపోయినట్లు కనిపిస్తోంది. ప్రజల ప్రాణాలతో ముడిపడిన ఈ సమస్యపై మంత్రి నాదెండ్ల మనోహర్ తక్షణమే స్పందించి, సంబంధిత అధికారులపై బాధ్యత నిర్ధారించి, అత్యవసరంగా రహదారి మరమ్మతులు, డ్రైనేజీ భద్రతా చర్యలు, మురుగునీటి తొలగింపు, దోమల నివారణ చర్యలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

VARTHAA SAKSHAMU
వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR



# ఓటర్ల జాబితాల తయారీ పకడ్బందీగా చేపట్టాలి

**-పట్టభద్రులు, ఉపాధ్యాయులు, స్థానిక సంస్థల నియోజకవర్గాల నమోదులో ఈసీఐ నిబంధనలు తప్పనిసరి: కలెక్టర్ సాయికాంత్ వర్మ**

జులై 29 వార్త సాక్ష్యం

పట్టభద్రులు, ఉపాధ్యాయులు, స్థానిక సంస్థల నియోజకవర్గాల ఓటర్ల జాబితాల తయారీ ప్రక్రియను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సి.యం. సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేసి అర్హులైన ప్రతి ఒక్కరిని ఓటర్ల జాబితాలో చేర్చాలని సూచించారు. పట్టభద్రులు, ఉపాధ్యాయులు, స్థానిక సంస్థల నియోజకవర్గాలకు సంబంధించిన ఓటర్ల జాబితాల తయారీ ప్రక్రియను ఎన్నికల సంఘం (ఈసీఐ) నిబంధనల మేరకు పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ సి.యం. సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు రాజేష్ కుమార్ సింగ్, రోహిత్ కుమార్, స్వతంత్ర కుమార్ మీనా, మల్లికార్జున్ రెడ్డిలతో కలిసి గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల ఎన్నికల నమోదు అధికారుల (ఈఆర్‌వోలు) సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్ల జాబితాల తయారీకి సంబంధించిన నిబంధనలు, అర్హతలు, దరఖాస్తుల పరిశీలన, అభ్యంతరాల పరిష్కారం తదితర అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పట్టభద్రులు, ఉపాధ్యాయుల నియోజకవర్గాల్లో ఓటర్లుగా నమోదు చేసుకునే వారి అర్హతను సంబంధిత ధ్రువపత్రాల ఆధారంగా క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. స్థానిక సంస్థల నియోజకవర్గాల ఓటర్ల జాబితా తయారీలో కూడా ఎన్నికల సంఘం మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన, ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ, క్లెయిమ్‌లు, అభ్యంతరాల పరిష్కారం, తుది జాబితా విడుదల వంటి ప్రతి దశను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ఎన్నికల సంఘం



ఆదేశాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో డీఆర్ఓ ఖాజావలి, జెడ్పీ సీఈఓ జ్యోతి బసు, డీపీఓ సాయికుమార్, ఈఆర్‌వోలు, జిల్లా ఎన్నికల విభాగం అధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# స్టీరింగ్‌పై వేగం- రోడ్డుపై మరణం-మాచర్ల డిపో బస్సుల దూకుడు

**-భయం గుప్పెట్లో ప్రయాణికులు, వాహనదారులు.**

పల్నాడు జులై 29 వార్త సాక్ష్యం

బస్సు ఆలస్యంగా చేరితే గరిష్ఠంగా కొన్ని నిమిషాలే నష్టం. కానీ ఒక నిర్లక్ష్య డ్రైవింగ్ వల్ల పోయే ప్రాణం తిరిగి రాదు. మాచర్ల--గుంటూరు జాతీయ రహదారిపై ఇప్పుడు ఇదే భయం వాహనదారులను వెంటాడుతోంది. మాచర్ల డిపోకు చెందిన కొన్ని ఆర్టీసీ బస్సుల వేగం, ఓవర్‌టేకింగ్ తీరు, ఎదురుగా వచ్చే వాహనాల పట్ల నిర్లక్ష్యం రోజురోజుకూ ప్రమాదాలకు కారణమవుతోందని తీవ్ర ఆరోపణలు వినిపిస్తున్నాయి. మాచర్ల నుంచి గుంటూరు వరకు ప్రయాణం ఇప్పుడు గమ్యానికి చేరుకోవడమే కాదు... ప్రాణాలతో తిరిగి చేరుకోవడమా అన్న ఆందోళనను కలిగిస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా మాచర్ల డిపోకు చెందిన కొన్ని ఆర్టీసీ బస్సుల డ్రైవింగ్ శైలి ప్రయాణికులు, ద్విచక్ర వాహనదారులు, కార్ల డ్రైవర్లలో తీవ్ర భయాందోళనలు సృష్టిస్తోందని చెబుతున్నారు. స్థానికుల కథనం ప్రకారం, ఎదురుగా వస్తున్న వాహనాలకు తగినంత అవకాశం ఇవ్వకుండా వేగంగా కట్‌లు కొట్టడం, ప్రమాదకరంగా ఓవర్‌టేక్ చేయడం, మలుపుల వద్ద కూడా వేగం తగ్గించకపోవడం నిత్యకృత్యంగా మారిందని ఆరోపిస్తు న్నారు. దీంతో ద్విచక్ర వాహనదారులు రోడ్డు పక్కకు తప్పుకోవడం, కొన్నిసార్లు పొలాల్లోకి దూసుకెళ్లడం, అదుపు తప్పి కిందపడడం వంటి ఘటనలు తరచూ జరుగుతున్నాయని చెబుతున్నారు. ఇటీవల సత్తెనపల్లి సమీపంలో మాచర్ల డిపో బస్సు ఢీకొనడంతో యువ అడ్వకేట్ మృతి చెందిన ఘటన తీవ్ర కలకలం రేపింది. ఆ ఘటన మరవకముందే ఇదే మార్గంలో బస్సుల వేగం, డ్రైవింగ్ తీరుపై మళ్లీ ప్రశ్నలు తలెత్తుతున్నాయి. గతంలోనూ ఇదే రహదారిపై పలు ప్రమాదాలు నమోదైనప్పటికీ పరిస్థితిలో ఆశించిన మార్పు కనిపించడం లేదని స్థానికులు అంటున్నారు. "బస్సు ఎదురుగా కనిపిస్తే బ్రేక్ వేయడం కాదు... ప్రాణాలు కాపాడుకోవడమే మొదటి పని" అని నిత్యం ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు వాపోతున్నారు. సమయపాలన పేరుతో వేగానికి ప్రాధాన్యం ఇస్తూ రోడ్డు భద్రతను విస్మరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. స్థానికుల అభిప్రాయం ప్రకారం, మాచర్ల--గుంటూరు రహదారిపై ఉన్న సీసీటీవీ ఫుటేజ్, బస్సుల జీపీఎస్ స్పీడ్ రికార్డులు, ప్రమాదాల చరిత్రను సమగ్రంగా పరిశీలిస్తే వాస్తవ పరిస్థితి బయటపడే అవకాశం ఉందని చెబుతున్నారు. కేవలం ప్రమాదం జరిగిన తర్వాత విచారణలు కాకుండా, ముందస్తు చర్యలే ప్రాణాలను కాపాడగలవని అభిప్రాయపడుతున్నారు. మాచర్ల డిపో అధికారులు వెంటనే స్పందించి డ్రైవర్లకు ప్రత్యేక రోడ్డు భద్రత శిక్షణ, కౌన్సెలింగ్ నిర్వహించాలని, వేగ



నియంత్రణకు కఠిన నిబంధనలు అమలు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఇటీవల జరిగిన ప్రమాదంతో పాటు గత ఘటనలపై కూడా సమగ్ర విచారణ జరిపి, నిర్లక్ష్యం తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# ఉద్యోగాలు అడిగే స్థాయి నుంచి ఇచ్చే స్థాయికి ఎదగాలి





**- ఐఐటీ, ఎన్ఐటీ విద్యార్థులకు మాజీ మంత్రి హరీశ్ రావు దిశానిర్దేశం**

సిద్ధిపేట జిల్లా జులై 29 వార్త సాక్ష్యం

ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని జీవితంలో పెద్ద విజయాలను సాధించాలని, చదువు పూర్తయ్యాక ఉద్యోగాలు అడిగే వారిగా కాకుండా పది మందికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు విద్యార్థులకు పిలుపునిచ్చారు. కేఆర్ ఉచిత ఇంజనీరింగ్, కెరీర్ గైడెన్స్ ఆధ్వర్యంలో ఐఐటీ, ఎన్ఐటీ, ట్రిపుల్ ఐటీల్లో సీట్లు సాధించిన విద్యార్థులకు సిద్దిపేట క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జాతీయ స్థాయి విద్యాసంస్థల్లో ప్రవేశాలు సాధించిన విద్యార్థులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ, పేద మరియు మధ్యతరగతి కుటుంబాల నుంచి వచ్చిన విద్యార్థులకు ఐఐటీ, ఎన్ఐటీల్లో సీట్లు రావడం సాధారణ విషయం కాదన్నారు. ఒక సీటు విద్యార్థి భవిష్యత్తును మాత్రమే కాకుండా కుటుంబ ఆర్థిక పరిస్థితులను కూడా మార్చగలదని పేర్కొన్నారు. విద్యార్థులు ఇంజనీరింగ్ పూర్తి చేసిన తర్వాత ప్రైవేట్ ఉద్యోగాలకే పరిమితం కాకుండా ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్, డిఫెన్స్ వంటి ఆల్ ఇండియా సర్వీసెస్ వైపు దృష్టి సారించాలని సూచించారు. జాతీయ స్థాయిలో మన ప్రాంతానికి చెందిన అధికారులు పెరగాలని, దేశ సేవలో యువత ముందుండాలని ఆకాంక్షించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఇంటర్నెట్ యుగంలో ప్రపంచం యువత చేతుల్లోనే ఉందని, వినూత్న ఆలోచనలతో స్టార్టప్‌లు స్థాపించి ఉపాధి అవకాశాలను సృష్టించే దిశగా ముందుకు సాగాలని సూచించారు. లక్ష్య సాధనలో ఎదురయ్యే అపజయాలను పట్టించుకోకుండా 'థింక్ బిగ్' అనే సూత్రంతో ముందుకు సాగాలని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు.

# భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**-సదాశివ నగర్ ఎస్సై పుష్పరాజ్**

కామారెడ్డిజులై 29 వార్త సాక్ష్యం

కామారెడ్డి జిల్లా సదాశివ నగర్ మండల కేంద్రంలోని భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మండల ప్రజల అప్రమత్తంగా ఉండాలి. ఈ సందర్భంగా ఎస్సై పుష్పరాజ్ మాట్లాడుతూ పలు సూచనలు చేశారు. పాత లేదా శతనావస్థలో ఉన్న ఇళ్లల్లో దూరంగా ఉండండి.2 విద్యుత్ స్తంభాలు తీగలు ట్రాన్స్ఫార్మర్ వద్దకు వెళ్ళవద్దు.3 పొంగి పొర్లుతున్న వాగులు చెరువులో దాటువద్దు. అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దు. చిన్నపిల్లలు వృద్ధులు ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ వహించండి. ఎవరైనా నదుల్లో కానీ ఎక్కడైనా చిక్కుకుంటే పోలీస్ స్టేషన్ కు సమాచారం అందించాలి. తల్లిదండ్రులు పిల్లలను చెరువుగట్టుకు పొంగి పొర్లుతున్న వాగులు వద్దకు వెళ్లకుండా తల్లిదండ్రులు వారి పిల్లలను చూడాలని సదాశివ నగర్ ఎస్సై పుష్పరాజ్ సూచించారు.



## నూతన ఎంపీడీవో గా రాజారావు బాధ్యతల స్వీకరణ



వేటపాలెంజులై 29 వార్త సాక్ష్యం

వేటపాలెం మండల నూతన మండల అభివృద్ధి అధికారి (ఎంపీడీవో)గా పాశం రాజారావు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మండల ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది ఆయనకు ఘన స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు.మండల అభివృద్ధి, గ్రామీణ సంక్షేమం, ప్రభుత్వ సంక్షేమ పథకాల సమర్థ అమలు, గ్రామ పంచాయతీల పనితీరు పర్యవేక్షణ, తాగునీరు, పారిశుద్ధ్యం, ఉపాధి హామీ, మౌలిక సదుపాయాల కల్పన వంటి అభివృద్ధి కార్యక్రమాల అమలులో ఎంపీడీవో కీలక పాత్ర పోషిస్తారు. ప్రజలకు ప్రభుత్వ సేవలను పారదర్శకంగా, వేగవంతంగా అందించడంతో పాటు సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేయడం ఎంపీడీవో ప్రధాన బాధ్యతగా ఉంటుంది.నూతన ఎంపీడీవో పాశం రాజారావు నాయకత్వంలో మండల అభివృద్ధి మరింత వేగవంతం కావడంతో పాటు ప్రజలకు ప్రభుత్వ సేవలు సమర్థవంతంగా అందుతాయని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## జ్యోతి హాస్పిటల్ లో ఓపెన్ హార్ట్ బైపాస్ సర్జరీ విజయవంతం

**-హర్షం వ్యక్తం చేసిన డాక్టర్ ముమ్వా రామారావు,డాక్టర్ జీవనజ్యోతి....**
**-ఓపెన్ హార్ట్ బైపాస్ సర్జరీ థియేటర్ ను ప్రజల ముందుకు తీసుకువచ్చిన డాక్టర్ నువ్వా రామారావు**



మిర్యాలగూడ ప్రతినిధిజులై 29 వార్త సాక్ష్యం

గుండె జబ్బు బాధితులు గుండెకు సంబంధించిన ఓపెన్ బైపాస్ సర్జరీ ల కోసం ఇక హైదరాబాద్ వంటి మహానగరాలకు వెళ్లాల్సిన అవసరం లేదు అంతా మిర్యాలగూడలోనే చేయించుకోవచ్చు. ఆరోగ్యశ్రీ ఒంటి ప్రభుత్వ పథకాలు ద్వారా కూడా వైద్యాన్ని ప్రజలకు అందుబాటులో తీసుకువచ్చిన ఘనత డాక్టర్ ముమ్వా రామారావు అని చెప్పడంలో అతిశయోక్తి లేదు. గత 30 సంవత్సరాల క్రితం అనుముల మండలం చింతగూడెం గ్రామం నుంచి ఉన్నత విద్య వైద్య వృత్తులలో ప్రావీణ్యం సాధించి విద్యను పూర్తి చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఒక లక్ష్యంతో మిర్యాలగూడలో వచ్చిన డాక్టర్ రామారావు ఏనాడు కూడా ప్రజలను ఇబ్బందులు గురి చేయకుండా స్వల్ప ఖర్చులకు వైద్య సేవలు అందించారు. మిర్యాలగూడకు చెందిన పూర్వపు డాక్టర్లు డాక్టర్ వెంకటరెడ్డి, డాక్టర్ శరత్ బాబు, డాక్టర్ రాజు, తర్వాత సుదీర్ఘకాలంగా వైద్యవృత్తిలో నేటికీ కొనసాగుతూ ఆధునిక వసతులతో కూడిన నూతన కార్పొరేట్ భవనశీను సొంతంగా కలిగి ఉండి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్న ఏకైక వ్యక్తి ఎవరు అంటే డాక్టర్ ముమ్వా రామారావే అని చెప్పవచ్చు. డాక్టర్ ముమ్వరామారావు, డాక్టర్ జీవనజ్యోతి, సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ రమేష్, కార్డియాలజిస్ట్ డాక్టర్ మనోజ్ కుమార్ రెడ్డి, కార్డియా అనస్థీషియా ఉ కార్డియాక్ క్రిటికల్ కేర్ డాక్టర్ లావణ్య, డాక్టర్ కృష్ణ చక్ర ఆధ్వర్యంలో మొట్టమొదటి ఓపెన్ హార్ట్ బైపాస్ సర్జరీ విజయవంతం అయినది. మిర్యాలగూడ పట్టణంలో జ్యోతి హాస్పిటల్ లో ఇటీవల ఓపెన్ హార్ట్ బైపాస్ సర్జరీ థియేటర్ అత్యధిక ఆధునిక వైద్య సదుపాయాలతో కూడిన థియేటర్ను నిర్మించారు. ప్రజలకు అందుబాటులో తీసుకొచ్చారు అందులో భాగంగా ఈనెల 20వ తారీఖున వీర్లపాలెం గ్రామానికి 60 సంవత్సరాలు మహిళకు గుండెకు సంబంధించిన నొప్పితో తన హాస్పిటల్ కు రావడంతో ఆమె పరీక్షలు నిర్వహించి గుండెలో బ్లాకులు మూసుకుపోవడంతో అత్యవసర పరిస్థితుల్లో ఆమెకు ఓపెన్ హార్ట్ బైపాస్ సర్జరీ నిర్వహించడం జరిగింది. ఆపరేషన్ విజయవంతం అయింది.వారు పూర్తిగా ఆరోగ్యంగా ఉన్నారు. సుమారు నాలుగు కోట్ల రూపాయలతో హార్ట్ లంగ్ మిషన్, హీటర్ కూలర్, మైక్రో ఇన్వెస్ట్మెంట్స్, కార్డియా క్రిటికల్ వంటి సౌకర్యాలతో కూడిన ఆధునికమైన థియేటర్ను నిర్మించడం జరిగింది. గతంలో ఓపెన్ బైపాస్ సర్జరీలకు హైదరాబాద్ గుంటూరు విజయవాడ ఒంటి పట్టణాలకు వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు అవసరం లేకుండా స్థానికంగానే ఓపెన్ హార్ట్ బైపాస్ చార్జర్ ని చేయించుకోవచ్చు అని జ్యోతి హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ నువ్వారామారావు విలేకరుల సమావేశంలో తెలిపారు . తమ హాస్పటల్ సిబ్బంది మరియు ప్రజలు సహకారంతోనే తమ ఈ సేవలు అందించగలుగుతున్నామని పేర్కొన్నారు డాక్టర్ ముమ్వా శ్రీ హర్ష గ్యాస్ట్రో సర్జన్, కార్డియాక్ స్టాప్ విజయలక్ష్మి, సునీల్, సైదులు, లక్ష్మణ్, కార్డియాలజీ సర్జరీ డిపార్ట్మెంట్ కోఆర్డినేటర్ డేగా వీటి ,ఆరోగ్య మిత్ర షేక్ బషీరుద్దీన్ కార్డియాలజీ సపోర్ట్ స్టాప్ బాలు ,నాగరాజు, నాగేందర్, పాల్గొన్నారు.

VARTHAA SAKSHAMU
వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR


# బిజినెస్

## భారత పర్యాటకులకు గుడ్‌న్యూస్.. యూపీఐతో బుర్జ్ ఖలీఫా టికెట్లు




భారతీయ పర్యాటకులకు గుడ్‌న్యూస్. ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన భవనం బుర్జ్ ఖలీఫాను సందర్శించేందుకు ఇప్పుడు యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ద్వారా ఆన్‌లైన్‌లోనే టికెట్లు బుక్ చేసుకోవచ్చు. యూఏఈలో ఈ-కామర్స్ లావాదేవీల కోసం యూపీఐ చెల్లింపులను స్వీకరిస్తున్న తొలి సంస్థగా బుర్జ్ ఖలీఫా నిలిచింది. ఈ సేవలను ఎన్‌పీసీఐ ఇంటర్నేషనల్ పేమెంట్స్ లిమిటెడ్ (ఎన్ఐపీఎల్), నియోపే (NEOPĀ), ఈమార్ ఎంటర్‌టైన్‌మెంట్ భాగస్వామ్యంతో ప్రారంభించినట్లు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కొత్త సదుపాయంతో భారత పర్యాటకులు యూఏఈకి ప్రయాణానికి ముందే బుర్జ్ ఖలీఫా అధికారిక వెబ్‌సైట్ నుంచి తమకు నచ్చిన యూపీఐ యాప్‌తో సులభంగా టికెట్లు కొనుగోలు చేయవచ్చు. యూఏఈలో 2022లోనే క్యూఆర్ కోడ్ ఆధారిత యూపీఐ చెల్లింపులు అందుబాటులోకి వచ్చాయి. నియోపే నెట్‌వర్క్‌లోని వ్యాపార సంస్థల వద్ద భారత పర్యాటకులు యూపీఐ ద్వారా చెల్లింపులు చేస్తున్నారు. ఇప్పుడు ఈ సేవలను ఆన్‌లైన్ బుకింగ్స్‌కు కూడా విస్తరించారు. ఈ సందర్భంగా ఎన్‌పీసీఐ ఇంటర్నేషనల్ ఎండీ, సీఈఓ రితేశ్ శుక్లా మాట్లాడుతూ.. "విదేశాలకు వెళ్లినప్పుడు భారత పర్యాటకులు సులభమైన, సుపరిచితమైన చెల్లింపు అనుభవాన్ని కోరుకుంటున్నారు. ఈ సదుపాయంతో వారు యూఏఈకి రాకముందే తమకు అలవాటైన యూపీఐతో టికెట్లు బుక్ చేసుకోవచ్చు" అని తెలిపారు. గల్ఫ్ దేశాల్లో ఈ-కామర్స్ కోసం యూపీఐ సేవలను ప్రారంభించిన తొలి సంస్థ తమదేనని నియోపే సీఈఓ విభోర్ ముంధాడా అన్నారు. తమ వద్దకు అత్యధికంగా వచ్చే అంతర్జాతీయ సందర్శకులలో భారతీయులు ఒకరని, ఈ కొత్త విధానం వారి బుకింగ్ ప్రక్రియను మరింత సులభతరం చేస్తుందని ఈమార్ ప్రతినిధి పేర్కొన్నారు.

## పెనాల్టీలతో బ్యాంకుల ఖజానా ఫుల్
## నాలుగేళ్లలో రూ.26,000 కోట్లకు పైగా వసూలు!




దేశంలోని బ్యాంకులు తమ ఖాతాదారులకు భారీ షాక్ ఇచ్చాయి. అకౌంట్లలో కనీస సగటు బ్యాలెన్స్ నిర్వహించనందుకు గత నాలుగు ఆర్థిక సంవత్సరాల్లో ఏకంగా రూ.26,170 కోట్లకు పైగా జరిమానాల రూపంలో వసూలు చేశాయి. ఈ కీలక వివరాలను కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో వెల్లడించింది. రాజ్యసభలో కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి ఒక లిఖితపూర్వక సమాధానంలో ఈ గణాంకాలను అందించారు. 2022-23 నుంచి 2025-26 ఆర్థిక సంవత్సరం మధ్య కాలంలో ఈ భారీ మొత్తాన్ని బ్యాంకులు ఆర్జించాయి. ఈ వసూళ్లలో ప్రభుత్వ రంగ బ్యాంకుల (పీఎస్‌బీ)తో పోలిస్తే ప్రైవేట్ రంగ బ్యాంకుల వాటానే అధికంగా ఉండటం గమనార్హం. కేవలం గత ఆర్థిక సంవత్సరం (FY26) లోనే బ్యాంకులు రూ.7,086.63 కోట్లను మినిమమ్ బ్యాలెన్స్ ఛార్జీల కింద వసూలు చేశాయి. ఇందులో ప్రభుత్వ రంగ బ్యాంకులు రూ.2,137.92 కోట్లు వసూలు చేయగా, ప్రైవేట్ బ్యాంకులు ఏకంగా రూ.4,948.71 కోట్లు ఆర్జించాయి. ఇది ప్రభుత్వ బ్యాంకుల వసూళ్ల కన్నా రెండింతలకు పైగా ఉండటం గమనార్హం.ప్రైవేట్ బ్యాంకుల్లో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ అత్యధికంగా రూ.1,798.14 కోట్లతో మొదటి స్థానంలో నిలిచింది. ఆ తర్వాత యాక్సిస్ బ్యాంక్ రూ.1,081.33 కోట్లు వసూలు చేసింది. ఈ రెండు బ్యాంకుల వాటానే ప్రైవేట్ బ్యాంకుల మొత్తం వసూళ్లలో దాదాపు 58 శాతంగా ఉంది. ఐసీఐసీఐ బ్యాంక్ (రూ.353.50 కోట్లు), కోటక్ మహీంద్రా బ్యాంక్ (రూ.290.65 కోట్లు), యెస్ బ్యాంక్ (రూ.195.05 కోట్లు) వంటివి కూడా గణనీయంగా జరిమానాలు విధించాయి.

## కొన్నేళ్ల పాటు కంపెనీలో జీతం తీసుకోలేదు- ఇప్పుడు లక్షల కోట్ల సంపదకు అధిపతి!




సంస్థ లాభాల బాట పట్టే వరకు తాను వేతనం తీసుకోబోనని శపథం చేసిన ఒక వ్యవస్థాపకుడికి స్టాక్ మార్కెట్ ఊహించని సంపదను తెచ్చిపెట్టింది. చైనాకు చెందిన మెమరీ చిప్ తయారీ దిగ్గజం 'చాంగ్‌జిన్ మెమరీ టెక్నాలజీస్' (సీఎక్స్ఎంటీ) వ్యవస్థాపకుడు జూ యిమింగ్, కంపెనీ రికార్డు స్థాయి ఐపీఓతో ఒక్కరోజులోనే బిలియనీర్‌గా అవతరించారు. దీంతో ఆయన సంపద విలువ సుమారు 15.9 బిలియన్ డాలర్లకు (సుమారు రూ. 1.32 లక్షల కోట్లు) చేరుకుంది. మరోవైపు, టెక్ దిగ్గజం యాపిల్ తన ఉత్పత్తుల కోసం సీఎక్స్ఎంటీ చిప్‌ల వినియోగాన్ని పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. సెమీకండక్టర్ల రంగంలో స్వయం సమృద్ధి సాధించాలన్న చైనా లక్ష్యాల్లో భాగంగా 2016లో సీఎక్స్ఎంటీ ప్రారంభమైంది. శాంసంగ్, మైక్రాన్ వంటి అంతర్జాతీయ దిగ్గజాలకు పోటీగా స్వదేశీ సాంకేతికతతో డీ-ర్యామ్ చిప్‌లను తయారు చేయడమే లక్ష్యంగా జూ యిమింగ్ ఈ సంస్థను స్థాపించారు. కంపెనీ నష్టాల్లో ఉన్నకాలంలో జీతభత్యాలు, బోనస్‌లు తీసుకోకుండా పనిచేసిన ఆయన, ఇప్పుడు ఐపీఓ విజయంతో ప్రపంచ కుబేరుల జాబితాలో చేరారు. జూ యిమింగ్ గత ఎనిమిదేళ్లుగా ఎటువంటి వేతనం తీసుకోలేదు. సీఎక్స్ఎంటీని స్థాపించడానికి ముందే ఆయన ఒక విజయవంతమైన వ్యాపారవేత్తగా గుర్తింపు పొందారు. చైనాలోని ప్రతిష్ఠాత్మక చింగ్‌వా విశ్వవిద్యాలయంలో భౌతికశాస్త్రాన్ని అభ్యసించిన ఆయన, అనంతరం అమెరికాలో ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్‌లో ఉన్నత విద్యను పూర్తి చేశారు. సిలికాన్ వ్యాలీలో తన వృత్తి జీవితాన్ని ప్రారంభించిన ఆయన, ఆ తర్వాత స్వదేశానికి తిరిగి వచ్చి 2005లో గిగా డివైస్ అనే ఫ్లాష్ మెమొరీ చిప్ తయారీ సంస్థను ఏర్పాటు చేశారు. దానిని విజయవంతంగా నడిపిన అనంతరం, సెమీకండక్టర్ల రంగంలోకి అడుగుపెట్టారు.

---

## కామన్వెల్త్ గేమ్స్: సెమీస్‌కు బాక్సర్లు సాక్షి, అరుంధతి.. భారత్‌కు మరో రెండు పతకాలు ఖాయం!

**ఇంటర్నెట్ డెస్క్:**

కామన్వెల్త్ గేమ్స్ 2026లో భారత బాక్సర్లు మరోసారి సత్తా చాటారు. మహిళల 51 కేజీల విభాగంలో సాక్షి చౌదరి, 66 కేజీల విభాగంలో అరుంధతి చౌదరి సెమీఫైనల్‌కు అర్హత సాధించారు. భారత్‌కు మరో రెండు పతకాలు ఖాయం చేశారు. ఇప్పటికే లవ్లీనా బోర్గొహైన్ (75 కేజీలు), ప్రియా ఘంఘాస్ (60 కేజీలు), ప్రీతి పవార్ (54 కేజీలు), జాదుమణి సింగ్ (55 కేజీలు) కూడా సెమీస్‌కు చేరడంతో భారత్‌కు పతకాల పంట పండింది. బాక్సింగ్‌లో భారత్‌కు ఐదు పతకాలు రావడం లాంఛనమైంది.క్వార్టర్ ఫైనల్లో సాక్షి చౌదరి ఉత్తర ఐర్లాండ్‌కు చెందిన కైట్‌లిన్ ఫ్రయర్స్‌పై 5-0 తేడాతో ఘన విజయం సాధించింది. తన ఎత్తు, రీచ్‌ను సమర్థంగా వినియోగించుకున్న సాక్షి ఆరంభం నుంచే ప్రత్యర్థిపై ఆధిపత్యం చెలాయించింది. ప్రత్యర్థి దూకుడుగా ఆడినా, చక్కటి ఫుట్‌వర్క్, కచ్చితమైన పంచ్‌లతో సాక్షి మ్యాచ్‌ను పూర్తిగా తన ఆధీనంలో ఉంచుకుంది. మరో క్వార్టర్ ఫైనల్లో అరుంధతి చౌదరి న్యూజిలాండ్ బాక్సర్ మోర్గాన్ హెండర్సన్‌పై 3-1తో విజయం సాధించింది. హోరాహోరీగా సాగిన ఈ పోరులో అరుంధతి చివరికి పైచేయి సాధించి సెమీస్‌కు అర్హత




## ఐపీఎల్ చరిత్రలోనే సరికొత్త మైలురాయి 300 మిలియన్ డాలర్ల బ్రాండ్‌గా ఆర్సీబీ

**ఇంటర్నెట్ డెస్క్:**

ఇండియన్ ప్రీమియర్ లీగ్ చరిత్రలోనే రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు అరుదైన ఘనత సాధించింది. 300 మిలియన్ డాలర్ల బ్రాండ్ విలువ దాటిన తొలి ఐపీఎల్ ఫ్రాంచైజీగా నిలిచింది. యూఎస్‌కు చెందిన ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ 'హౌలిహాన్ లోకీ' విడుదల చేసిన '2026 ఐపీఎల్ వాల్యుయేషన్ స్టడీ' అనే నివేదిక ప్రకారం ఆర్సీబీ బ్రాండ్ విలువ 16 శాతం పెరిగి 312 మిలియన్ డాలర్లకు చేరింది. మరోవైపు ఐపీఎల్ మొత్తం వ్యాపార విలువ తొలిసారి 20.6 బిలియన్ డాలర్లకు చేరి మరో మైలురాయిని అందుకుంది. 2026 సీజన్‌లో ఐపీఎల్‌తో పాటు మహిళల ప్రీమియర్ లీగ్ టైటిళ్లను గెలవడం, భారీగా అభిమానులు, బలమైన వాణిజ్య ఒప్పందాలు ఆర్సీబీ విలువ పెరగడానికి ప్రధాన కారణాలుగా నివేదిక పేర్కొంది. ఈ జాబితాలో ముంబయి ఇండియన్స్ 264 మిలియన్ డాలర్లతో రెండో స్థానంలో ఉండగా కోల్‌కతా నైట్ రైడర్స్ 245 మిలియన్ డాలర్లతో మూడో స్థానంలో నిలిచింది. ధోని లేకపోవడం, ఈ సీజన్‌లో వరుస పరాజయాలు చవి చూడటం వల్ల చెన్నై సూపర్ కింగ్స్ 244 మిలియన్ డాలర్లతో నాలుగో స్థానానికి పరిమితమైంది. ఎస్ఆర్‌హెచ్, ఆర్ఆర్, జీటీ, ఢిల్లీ క్యాపిటల్స్, లఖ్‌నవూ సూపర్ జెయింట్స్




ఆ తర్వాతి స్థానాల్లో నిలిచాయి. నివేదిక ప్రకారం 2023లో 15.4 బిలియన్ డాలర్లుగా ఉన్న ఐపీఎల్ బ్రాండ్ విలువ.. 2024లో 16.4 బిలియన్ డాలర్లు, 2025లో 18.5 బిలియన్ డాలర్లకు పెరిగి, ఇప్పుడు 20.6 బిలియన్ డాలర్లను చేరుకుంది. మీడియా హక్కులు, స్పాన్సర్‌షిప్‌లు, టికెట్ విక్రయాలతో కలిపి 2026 సీజన్ ఆదాయం 1.8 బిలియన్ డాలర్లను దాటే అవకాశం ఉందని అంచనా వేసింది. 2028 నుంచి అమల్లోకి వచ్చే కొత్త మీడియా హక్కుల ఒప్పందం ద్వారా ఐపీఎల్ విలువ మరింత పెరిగే అవకాశముందని నివేదిక స్పష్టం చేసింది.

# స్పోర్ట్స్

## ఇంగ్లండ్ క్లబ్ క్రికెట్‌లో సంచలనం
## అసలేంటీ 'క్లికీ పాంటింగ్' వివాదం?




**ఇంటర్నెట్ డెస్క్:**

ఇంగ్లండ్ క్లబ్ క్రికెట్‌లో చోటుచేసుకున్న ఓ ఘటన ఇప్పుడు ప్రపంచ క్రికెట్‌లో తీవ్ర చర్చకు దారితీసింది. సాల్ట్‌బర్న్ క్రికెట్ క్లబ్‌కు చెందిన ఓ ఫీల్డర్ బ్రియాన్ డివైన్.. బంతి బ్యాట్‌కు తగలకపోయినా వేళ్లతో చిటికె వేసి శబ్దం చేసిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న సంగతి తెలిసిందే. ఈ వివాదానికి అభిమానులు 'క్లిక్‌గేట్', 'క్లికీ పాంటింగ్' అనే పేర్లు పెట్టారు. అసలు ఈ వివాదానికి ఆ పేర్లు ఎందుకు పెట్టారనే ప్రశ్న చాలామందిలో మొదలైంది.సోషల్ మీడియాలో అభిమానులు బ్రియాన్ డివైన్‌పై వ్యంగ్యంగా స్పందిస్తూ క్లికీ పాంటింగ్ అనే పేరు పెట్టారు. వేళ్లతో 'క్లిక్' అన్నట్లు చేసిన శబ్దాన్ని ఉద్దేశించి 'రికీ' స్థానంలో 'క్లికీ' అని మార్చి పెట్టారు. ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్ పేరు వచ్చేలా రికీ స్థానంలో క్లికీ అని పెట్టి దాన్ని 'క్లికీ పాంటింగ్' అని పిలవడం మొదలు పెట్టారు. అయితే ఈ ఘటనతో పాంటింగ్‌కు ఎలాంటి సంబంధం లేదు. ఆటలో వ్యూహాలు మార్చే ప్లేయర్‌గా గతంలో అతడికి పేరుంది. దాన్నే ఆధారంగా చేసుకుని ఈ పేరు పెట్టినట్లు తెలుస్తోంది.

**-అసలు ఏమైందంటే?**

నార్త్ యార్క్‌షైర్ అండ్ సౌత్ డర్హామ్ క్రికెట్ లీగ్ డివిజన్-2లో సాల్ట్‌బర్న్ క్లబ్, నార్టన్ క్లబ్ మధ్య మ్యాచ్ జరుగుతుంది. సాల్ట్‌బర్న్ స్లిప్ ఫీల్డర్ బ్రియాన్ డివైన్.. బ్యాటర్ నోమన్ షబీర్ బ్యాట్ పక్కగా బంతి వెళ్లే సమయంలో వేళ్లతో 'క్లిక్' శబ్దం చేశాడు.

## ‘శ్రీనివాస మంగాపురం’ రన్ టైమ్ ఇదే!

ఒక సినిమా కథలో దర్శకుడికి ఎంత నమ్మకం, స్పష్టత ఉన్నాయో చెప్పడానికి ఆ చిత్ర నిడివి కూడా ఒక నిదర్శనంగా నిలుస్తుంది. తాజాగా, దర్శకుడు అజయ్ భూపతి తన కొత్త చిత్రం ‘శ్రీనివాస మంగాపురం’ రన్‌టైమ్‌ను అధికారికంగా ప్రకటించారు. ఈ సినిమా 2 గంటల 35 నిమిషాల నిడివితో ప్రేక్షకులను పలకరించనుంది. “సీజన్‌లోనే అత్యంత గాఢమైన ప్రేమకథ” అని ప్రచారం చేస్తున్న ఈ చిత్రానికి ఇంత నిడివిని లాక్ చేయడం, కథ పై యూనిట్‌కు ఉన్న గట్టి నమ్మకాన్ని తెలియజేస్తోందని ఇండస్ట్రీ వర్గాలు భావిస్తున్నాయి.‘RX 100’ చిత్రంతో టాలీవుడ్‌లో సంచలనం సృష్టించి, తనకంటూ ఒక ప్రత్యేకమైన బ్రాండ్ క్రియేట్ చేసుకున్న దర్శకుడు అజయ్ భూపతి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఆయన చిత్రాలంటేనే రా, రస్టిక్ భావోద్వేగాలకు పెట్టింది పేరు. ఇప్పుడు పూర్తిస్థాయి ప్రేమకథతో వస్తుండటంతో సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. ఈ చిత్రంతో ఘట్టమనేని కుటుంబం నుంచి జైకృష్ణ హీరోగా తెలుగు తెరకు పరిచయం కానుండటం మరో ప్రధాన ఆకర్షణ. ఇదే సినిమాతో బాలీవుడ్ భామ రవీనా టాండన్ కుమార్తె రాషా థడానీ కూడా టాలీవుడ్ అరంగేట్రం చేస్తోంది. ఇప్పటికే విడుదలైన అప్ డేట్స్ ద్వారా జయకృష్ణ ఘట్టమనేని, రాషా కెమిస్ట్రీ అందరినీ ఆకట్టుకుంటోంది. ఇందులో సీనియర్ నటుడు మోహన్ బాబు పవర్ ఫుల్ రోల్‌లో కనిపించనున్నారు.



## రీఎంట్రీకి ఇది సరైన సినిమా అనిపించింది: వరుణ్ తేజ్








గత రెండేళ్లుగా వెండితెరకు దూరంగా ఉండటంపై కథానాయకుడు వరుణ్ తేజ్ స్పష్టతనిచ్చారు. ఇది బలవంతంగా తీసుకున్న విరామం కాదని, భవిష్యత్తులో ఎటువంటి పాత్రలు పోషించాలనే అంశంపై స్పష్టత తెచ్చుకోవడం కోసమే ఈ విరామం తీసుకు న్నానని ఆయన తెలిపారు. మేర్లపాక గాంధీ దర్శకత్వంలో తాను నటిస్తున్న ఇండో–కొరియన్ హారర్ కామెడీ చిత్రం ‘కొరియన్ కనకరాజు’తో ఆయన త్వరలో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. తాజాగా ఒక ఇంటర్వ్యూలో వరుణ్ తేజ్ మాట్లాడుతూ, “కేవలం విరామం తీసుకోవాలనే ఉద్దేశంతో నేను సినిమాలకు దూరం కాలేదు. ఎటువంటి పాత్రలు చేయాలనే విషయంపై నాకు పూర్తి స్పష్టత కావాలి. మొక్కుబడిగా సినిమాలు చేయడం నాకు ఇష్టం ఉండదు. కథను పూర్తిగా నమ్మినప్పుడే ప్రాజెక్టుకు అంగీకరిస్తాను” అని వివరించారు. ఈ క్రమంలోనే దర్శకుడు గాంధీ వినిపించిన ‘కొరియన్ కనకరాజు’ కథ ఎంతో వైవిధ్యంగా అనిపించిందని, సుదీర్ఘ విరామం తర్వాత పునరాగమనానికి ఇది సరైన చిత్రమని భావించి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు పేర్కొన్నారు. చిత్ర విశేషాలను పంచుకుంటూ, “ఇది ఇండో–కొరియన్ నేపథ్యంలో సాగే హారర్ కామెడీ చిత్రం. తెలుగు చలనచిత్ర పరిశ్రమలో ఇప్పటివరకు ఎవరూ ఇటువంటి జోనర్‌ను ప్రయత్నించలేదు. అందుకే ఈ కథ వినగానే వెంటనే అంగీకరిం చాను” అని తెలిపారు. ఇందులో తన పాత్ర పేరు కనకరాజు అని, తన నిజ జీవిత వ్యక్తిత్వానికి పూర్తి భిన్నంగా సాగే ఈ పాత్ర ప్రేక్షకులను విశేషంగా అలరిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ పాత్ర కోసం తాను చేసిన కసరత్తులను వరుణ్ వెల్లడించారు. రాయలసీమ యాస నేర్చుకోవడంతో పాటు, కొరియన్ భాషలో సుదీర్ఘ సంభాషణలు పలకడం, విభిన్నమైన లుక్ కోసం జుట్టు పెంచడం మరియు నృత్యాలపై ప్రత్యేక శ్రద్ధ వహించడం వంటివి చేశానని పేర్కొన్నారు. ఈ చిత్రంలో వరుణ్ తేజ్ సరసన రితికా నాయక్ కథానాయికగా నటిస్తోంది. ఎంతో ఆసక్తిని రేకెత్తిస్తున్న ‘కొరియన్ కనకరాజు’ చిత్రం ఆగస్టు 7న థియేటర్లలో విడుదల కానుంది.

## ‘ఆదర్శ కుటుంబం’: వెంకటేశ్ కూతురిగా యువినా పార్థవి నవ్వులు పంచుతున్న కొత్త గ్లింప్స్




విక్టరీ వెంకటేశ్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో వస్తున్న చిత్రం ‘ఆదర్శ కుటుంబం హౌస్ నెం. 47’ (ఏకే 47). తాజాగా ఈ చిత్రం నుంచి మరో ఆసక్తికరమైన అప్‌డేట్ వచ్చింది. చిత్ర యూనిట్ తాజాగా ఈ సినిమాలోని మరో ముఖ్య పాత్రను పరిచయం చేస్తూ ఒక చిన్న వీడియో గ్లింప్స్‌ను విడుదల చేసింది. ఇందులో వెంకటేష్ కూతురు ‘సంపూర్ణ” పాత్రలో నటి యువినా పార్థవిని ప్రేక్షకులకు పరిచయం చేశారు. ఈ కొత్త గ్లింప్స్‌లో, చిట్టిబాబు పాత్రలో ఉన్న వెంకటేశ్, రఘుబాబుతో ఇంటి విషయాల గురించి మాట్లాడుతుండగా, వారి కూతురు సంపూర్ణ (యువి నాపార్థవి) ఎంతో ఉత్సాహంగా పరిగెత్తుకుంటూ వస్తుంది. “నాన్నా.. నేను ప్రేమలో పడ్డాను” అని తండ్రితో చెబుతుంది. దానికి చిట్టిబాబు చిరాకు పడుతూ, “ఈసారి కార్ డ్రైవర్‌తోనా, మెకానిక్ తోనా?” అని అడగటంతో ఈ వీడియోలో చూడొ చ్చు. తండ్రీకూతుళ్ల మధ్య సాగే ఈ ఫన్నీ సంభా షణ, సినిమా ఫ్యామిలీ కామెడీ ఎంట ర్‌టైనర్‌గా ఉండబోతోందన్న సంకేతాలను ఇస్తోంది. ఈ గ్లింప్స్‌కు సోషల్ మీడియాలో మంచి స్పందన లబి ,స్తోంది. చిత్రబృందం వినూత్నంగా ప్రమోషన్లు నిర్వహిస్తోంది. ఇప్పటికే వెంకటేశ్ ను చిట్టిబాబుగా, ఆయన భార్య స్వర్ణ పాత్రలో శ్రీనిధి శెట్టిని పరిచయం చేసిన సంగతి తెలిసిందే. ఇప్పుడు కూతురి పాత్రను కూడా పరిచయం చేయడంతో సినిమాపై అంచనాలు మరింత పెరుగుతున్నాయి. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్. రాధాకృష్ణ (చినబాబు)ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమా లో వెంకటేశ్, శ్రీనిధి శెట్టి, యువినా పార్థవితో పాటు నివేదా పేతురాజ్,రాజ్ ప్రజ్వల్, రావు రమేశ్, సత్య, బ్రహ్మాజీ, వెన్నెల కిశోర్ వంటి భారీ తారాగణం నటిస్తోంది. తమన్ సంగీతం అందిస్తుండగా,రవి కె.చంద్రన్ సినిమాటో గ్రాఫర్‌గా, శ్రీకర్ ప్రసాద్ ఎడిటర్‌గా పని చేస్తున్నారు. ఈ పక్కా ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌ను 2026 అక్టోబర్ 2న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయడానికి నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.

## సంధ్యా థియేటర్ తొక్కిసలాట కేసు: నాంపల్లి కోర్టు కీలక ఆదేశాలు

హైదరాబాద్‌లోని సంధ్యా థియేటర్ వద్ద చోటుచేసుకున్న విషాదకర తొక్కిసలాట ఘటనపై నమోదైన కేసు విచారణను నాంపల్లి కోర్టు ఆగస్టు 17కి వాయిదా వేసింది. కేసు విచారణ సందర్భంలో న్యాయస్థానం పలు కీలక ఆదేశాలు జారీ చేసింది.అనారోగ్య సమస్యల కారణంగా ఈ కేసులోని ముగ్గురు నిందితులు కోర్టుకు హాజరుకాలేకపోతున్నారని నిందితుల తరఫు న్యాయవాదులు కోర్టుకు తెలిపారు. హీరో అల్లు అర్జున్‌కు ఇప్పటికే వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు లభించిన విషయం తెలిసిందే. విచారణలో భాగంగా ఛార్జ్‌షీట్‌తో పాటు కేసులోని డిజిటల్ పరికరాలు, ఎలక్ట్రానిక్ ఆధారాలు, సీసీటీవీ ఫుటేజీలను తమకు ఇంకా అందజేయలేదని నిందితుల తరఫు న్యాయవాదులు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.ఈ విజ్ఞప్తిని పరిశీలించిన న్యాయస్థానం... ఛార్జ్‌షీట్‌లో పేర్కొన్న అన్ని డిజిటల్ ఆధారాలు, వీడియో ఫుటేజీలు, పత్రాల కాపీలను తదుపరి విచారణ నాటికి నిందితుల న్యాయవాదులకు సమర్పించాలని పోలీసులను ఆదేశించింది. అనంతరం కేసు తదుపరి విచారణను ఆగస్టు 17కి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది.



PRINTED ,PUBLISHED ,OWNED BY VARTHAA SAKSHAMU NEWS .Regd no:APTEL/25/A5153, EDITOR :S.RAVI KUMAR, 32-3-1, SPG PALEM, ATMAKURU, KURNOOL ANDHRAPRADESH,-518422.